



ఊహల పల్లకీలో.. ఊరేగించనా!?

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎవరికో..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్రంలో ఐదుగురు ఎమ్మెల్సీల పదవీ కాలం వచ్చే నెల్లో ముగియనుండడంతో ఈ స్థానాలకు కొత్తగా ఎన్నిక నిర్వహించేందుకు వీలుగా సోమవారం షెడ్యూల్ జారీ అయింది. ఎమ్మెల్సీ పదవి కోసం అప్పుడే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఆశావహుల సందడి పెరిగింది. పార్టీ కోసం చేసిన సేవలకు గుర్తింపుగా ఎమ్మెల్సీ పదవి కోసం పలువురు నేతలు తెర వెనుక ప్రయత్నాలు ఆరంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్సీగా ఉన్న యనమల రామకృష్ణుడి పదవీ కాలం ముగుస్తుండడంతో ఆయనకు పొడిగింపు ఛాన్స్ లేనట్లేనని పార్టీ ఇదివరకే సంకేతాలు పంపింది. దీంతో ఉమ్మడి జిల్లా కోటా కింద ఎమ్మెల్సీ పదవి ఎవరిని వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు జనసేన నుంచి నాగబాబుకు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి కట్టబెడతారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఖాళీ అయిన ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఎవరిని వరిస్తాయో చూడాల్సిందే మరి.

యనమలకు ఛాన్స్ లేనట్లే..

తుని నుంచి మాజీ మంత్రి యనమల ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. కూటమి పార్టీ అధికారంలోకి రావడంతో ఈయనకు మంత్రి పదవి ఖాయమని ప్రచారం జరిగింది. కానీ ఈసారి ప్రభుత్వంలో యువ నేతలకు ఛాన్స్ ఇవ్వాలన్న టీడీపీ సిద్ధాంతం నేపథ్యంలో సీనియర్ అయిన యనమలకు అమాత్య పదవి దూరమైంది. అయితే ఎమ్మెల్సీ పదవి ఎలాగూ ఉండడంతో పెద్దగా యనమలకు ఇబ్బంది రాలేదు. పైగా ఎన్నికల్లో యనమల కుటుంబానికి ఒక ఎంపీ, రెండు అసెంబ్లీ సీట్లు పార్టీ కట్టబెట్టింది. దీంతో ఇప్పుడు యనమల తనయురాలు దివ్య తుని ఎమ్మెల్యేగా, అల్లుడు ఏలూరు ఎంపీగా ఉన్నారు. వియ్యంకుడు పుట్టా సుధాకర్ యాదవ్ మైదుకూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇలా యనమలతో కలిపి ఆయన కుటుంబానికి చెందిన మొత్తం నలుగురు వివిధ పదవుల్లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం యనమలకు ఉన్న ఎమ్మెల్సీ పదవి మార్చి 29వ తేదీతో ముగుస్తోంది. కానీ ఆయనకు తిరిగి ఈ పదవిని మళ్లీ కొనసాగించే అవకాశం లేదని పార్టీ ఇప్పటికే సంకేతాలు పంపింది. ఖాళీ అయిన ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఎమ్మెల్యేల బలం ప్రకారం కూటమికే దక్కనున్నాయి. వీటిలో టీడీపీ నాలుగు తీసుకుని, జనసేనకు ఒకటి కేటాయించే అవకాశం ఉంది.

నాడు పలువురి త్యాగం?

ఎన్నికల సమయంలో పిఠాపురం సీటును పవన్‌కల్యాణ్ కోసం మాజీ ఎమ్మెల్యే వర్మ త్యాగం చేశారు. బత్తుల బలరామకృష్ణ కోసం రాజానగరం సీటును బొడ్డు వెంకటరమణ చౌదరి, ప్రస్తుతం మంత్రి హోదాలో ఉన్న వాసంశెట్టి సుభాష్ కోసం రామచంద్రపురం సీటును రెడ్డి సుబ్రహ్మణ్యం, ప్రస్తుతం మంత్రి హోదాలో ఉన్న కందుల దుర్గేష్ కోసం నిడదవోలు సీటు బూరుగుపల్లి శేషారావు త్యాగం చేశారు. వీరిలో రాజానగరం సీటు త్యాగం చేసిన బొడ్డు వెంకటరమణ చౌదరిని రుడా ఛైర్మన్‌గా నియమించింది. అంతేకాకుండా రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌కు కేబినెట్ ర్యాంకు కట్టబెట్టింది. రెడ్డి సుబ్రహ్మణ్యంకు పార్టీ పొలిట్ బ్యూరో హోదా ఇచ్చింది. ఇక వీరిలో మిగిలింది వర్మ, శేషారావు మాత్రమే. నాడు టిక్కెట్లు కోసం గట్టిగా ప్రయత్నించిన మరికొందరికి వివిధ కార్పొరేషన్ల నామినేటెడ్ పదవులు కట్టబెట్టింది.

- ఎన్నిక షెడ్యూల్ జారీ
- మార్చి 20న పోలింగ్.. ఫలితాలు
- ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ
- 29 వరకూ ఎమ్మెల్సీగా యనమల
- మళ్లీ పొడిగింపు లేనట్లే?
- జిల్లా నుంచి ఎవరికి దక్కేనో
- ముందువరుసలో వర్మ
- పవన్ కోసం సీటు త్యాగం
- తొలి ఎమ్మెల్సీకి బాబు హామీ
- జనసేన నుంచి నాగబాబు
- ఆశావహుల ప్రయత్నాలు

ముందు వరుసలో వర్మ..

మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులో భాగంగా సీట్లు త్యాగం చేసిన వారికి ఎమ్మెల్సీ పదవుల్లో తొలి ప్రాధాన్యత ఉంటుందని టీడీపీ అధిష్ఠానం గతంలో ప్రకటించింది. యనమల స్థానంలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ పదవిని చంద్రబాబు ఎవరి ద్వారా భర్తీ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. రేసులో పిఠాపురం వర్మ ముందువరుసలో ఉన్నట్టు సమాచారం. ఎందుకంటే అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొత్తులో భాగంగా పిఠాపురం సీటును వర్మ త్యాగం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇక్కడి నుంచి పోటీ చేయడంతో వర్మకు సీటు లేకుండా పోయింది. ఈనేపథ్యంలో పార్టీ అధినేత చంద్రబాబు అమరావతికి వర్మను పిలిపించి అధికారంలోకి రాగానే తొలి ఎమ్మెల్సీ పోస్టు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ పదవితో పాటు క్షత్రియుల కోటాలో మరింత గౌరవం కల్పిస్తానని పేర్కొన్నారు. అటు ఎన్నికల ప్రచారంలో పవన్ సైతం వర్మ లాంటి నేత చట్టసభల్లో ఉండాలని పేర్కొన్నారు. దీంతో ఇప్పుడు వర్మకు ఎమ్మెల్సీ పదవి కట్టబెడతారనే ప్రచారం జరుగుతోంది. వర్మ సైతం తనకు ఈ దఫా పదవి వస్తుందని ఆశాభావంతో ఉన్నారు.

నాగబాబుకు ఇస్తే..

జనసేన నుంచి నాగబాబును ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవి ఇస్తారనే చర్చ జరిగింది. దీనికి సంబంధించి కొంతకాలం కిందట కూటమి తరఫున అధికారిక ప్రకటన వచ్చింది. నాగబాబుకు ఎమ్మెల్సీ ఇస్తే వర్మకు ఛాన్స్ ఉండదనే ప్రచారం కొంతకాలం కిందట జరిగింది. ఖాళీ అయిన ఐదు స్థానాల్లో ఒకటి జనసేనకు వెళ్లే అవకాశం ఉంది. దీంతో ఆ కోటాలో నాగబాబు ను భర్తీ చేస్తారనే చర్చ జరుగుతోంది. టీడీపీ ఖాతాలో ఉండే నాలుగింటిలో ఒకటి ఉమ్మడి జిల్లా కోటాలో వర్మకు ఇస్తారని, తద్వారా ఏ సమస్యా ఉండదనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

మా సంగతేంటి?

గడచిన ఐదేళ్లలో పార్టీ కోసం ఆర్థికంగా, కేడర్ పరంగా వెన్నుదన్నుగా ఉన్నామని, ఎమ్మెల్సీ పదవితో తమను గౌరవించాలని కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి కొందరు టీడీపీ నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఐదేళ్లలో పార్టీకి ఆర్థికంగాను, కేడర్‌పరంగాను చేసిన సేవలను వివరిస్తూ త్రుటిలో సీటు కోల్పోయిన విషయాన్ని గుర్తుచేస్తూ పదవికి పరిగణనలోకి తీసుకోవాలంటూ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇదిలా ఉండగా పార్టీ ఆశావహుల నియోజకవర్గాల్లో రహస్యంగా ఐవీఆర్ఎస్ సర్వే చేసినట్టు సమాచారం. ఆ సర్వే ప్రకారం పార్టీ ఇప్పటికే ఒక అంచనాకు వచ్చి ఉంటుందని అంటున్నారు. కోనసీమ జిల్లా నుంచి ఓ మహిళా నేత తనకున్న పలుకుబడితో ఎమ్మెల్సీ పదవి కోసం ప్రయత్నం చేస్తున్నారు. అటు కమ్మ సామాజికవర్గం నుంచి సైతం కొందరు నేతలు పావులు కదుపుతున్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్సీ పదవి ఎవరిని వరిస్తుందనేది త్వరలో తేలనుంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానానికి మార్చి 10న నామినేషన్ దాఖలు చేయడానికి ఆఖరిరోజు కావడంతో వచ్చే నెల మొదటివారంలోనే పదవుల కేటాయింపుపై స్పష్టత రానుంది.



కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్ల కల్యాణోత్సవం

సామర్లకోటలో భీమేశ్వరస్వామి కల్యాణం

వైభవంగా భీమేశ్వరుని కల్యాణం

కనుల పండువగా కుక్కుటేశుని కల్యాణం

6



అన్నవరం ఆలయంలో ఈవో, ఛైర్మన్‌తో కలసి సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

'అన్నవరం'లో సమూల మార్పులు

- కలెక్టర్ షాన్‌మోహన్ పర్యటన
- భక్తుల అభిప్రాయాల సేకరణ
- అన్నదానంలో భక్తులు వేచి ఉండకుండా సిట్టింగ్‌తోపాటు బఫే విధానం
- గదుల కేటాయింపునకు ఇకపై నగదు రహిత విధానం అమలు
- ఈవో, ఛైర్మన్, సిబ్బందితో సమీక్ష
- ఇకపై ప్రతినెలా సమీక్ష

7

విస్తృతంగా చికెన్ మేళాలు

- బర్డ్‌ఫ్లూ లేదంటూ హెచ్చరీల ఆధ్వర్యంలో కార్యక్రమాలు
- చికెన్‌తో భోజనం, పకోడి, ఉడకబెట్టిన గుడ్లు పంపిణీ
- తుని, పిఠాపురం, కొత్తపల్లిలలో కిటకిటలాడిన జనం

7

బర్డ్‌ఫ్లూ కేసుల్లేవ్

డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

జీజీహెచ్ (కాకినాడ),ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఎక్కడా బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కాలేదని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ సోమవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. కోడిమాంసం, కోడిగుడ్లు తినకూడదని ప్రజల్లో ఉన్నది అపోహ మాత్రమేనని ఆయన వెల్లడించారు. ప్రజలు కోడిమాంసం, కోడిగుడ్లు నిరభ్యతరంగా తినవచ్చని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో కోడిగుడ్లు క్రమం తప్పకుండా విద్యార్థులకు ఇవ్వడం జరుగుతోందన్నారు. ప్రజలకు అవగాహన కోసం చికెన్‌మేళాలు కూడా నిర్వహిస్తున్నారన్నారు. అయితే ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఎవరికైనా జ్వరం, జలుబు, తలపోటు, ఒళ్లనొప్పులు వంటి లక్షణాలు వస్తే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేసి వైద్య సహాయం పొందాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చికెన్‌ను పూర్తిగా 75 డిగ్రీల సెంటీగ్రేడ్‌కంటే అధిక ఉష్ణోగతలో ఉడికించినది మాత్రమే తినాలన్నారు. ముందు జాగ్రత్తల్లో భాగంగా పచ్చికోడి మాంసం, సగం ఉడకబెట్టిన కోడిగుడ్డు తినకూడదని ఆయన సూచించారు.

ఓటర్ల జాబితాలో పేర్లు పరిశీలించుకోవాలి

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల జాబితాలనే తమ పేర్లును పరిశీలించుకోవచ్చని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంతోపాటు, ఏఈఆర్వోల కార్యాలయంలో ఓటర్ల జాబితా ఉంచామన్నారు. నామినేషన్ చివరి రోజు వరకు ఆమోదం పొందిన ఓటర్ల జాబితాలో పేర్లు పరిశీలించుకోవాలన్నారు.

తుని లెక్క.. తేలింది!

- వైసీపీకి షాక్
- మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి రాజీనామా
- కౌన్సిలర్‌గా కొనసాగుతానంటూ వెల్లడి
- చేయిజారిపోయిన వైసీపీ కౌన్సిలర్లు
- కౌన్సిల్లో బలం తారుమారు
- టీడీపీ 16.. వైసీపీ 12 మంది కౌన్సిలర్లు
- వైస్‌చైర్మన్ రూపాదేవి సైతం టీడీపీలోకి..

తునిరూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మున్సిపాలిటీలో రాజకీయం మరింత రసవత్తరంగా మారింది. తుని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎన్నికపై సస్పెన్షన్ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే రెండో వైస్‌చైర్మన్ ఎన్నిక నాలుగుసార్లు వాయిదాపడిన విషయం తెలిసిందే. సోమవారం జరిగిన నాటకీయ పరిమాణాలతో వైసీపీ గందరగోళంలో పడిపోయింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించి మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రాన్ని సమర్పించారు. అయితే తాను మాత్రం సాధారణ కౌన్సిలర్‌గా కొనసాగుతానని కమిషనర్‌కు వెల్లడించారు. తుని మున్సిపాలిటీలో తమకు 18 మంది బలం ఉందని చెబుతూ వచ్చినప్పటికీ సోమవారం చైర్‌పర్సన్ రాజీనామా కార్యక్రమానికి 15 మంది మాత్రమే రాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. కానీ సాయంత్రానికి అందులో మరో ముగ్గురు టీడీపీ శిబిరం చెంతకు చేరారు. దాంతో వైసీపీ బలం 12గా ఎంతో తేలిపోయింది. ముందుగానే కౌన్సిల్‌లో తమ బలం పడిపోతోందని ఊహించిన మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా కొద్దిరోజులుగా రకరకాల డ్రామాలతో కాలం నెట్టుకొచ్చారు. వైస్ చైర్మన్ ఎన్నికకు రాకుండా ఉద్దేశపూర్వకంగా డ్రామాలకు తెరదీశారు.పైగా టీడీపీ ఈ ఎన్నికలను అడ్డుకుంటున్నట్టు ఎదురుదాడికి దిగారు. కానీ సోమవారం వారికున్న బలమెంతో స్పష్టమైపోయింది. అంతకుముందే మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఉన్న వైసీపీ కౌన్సిలర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటుచేసి రాజీనామాలు చేయాలని ఒత్తిడి తీసుకువచ్చినట్టు సమాచారం. కానీ కొందరు వైసీపీ కౌన్సిలర్లు తాము రాజీనామాకి సిద్ధం కాలేమని బాంబుపేల్చడంతో వైసీపీ షాక్ గురైంది.

కొత్తగా ఆరుగురు.. టీడీపీ బలం 17

తాజా పరిణామాల నేపథ్యంలో తుని వైసీపీకి చెందిన మరికొందరు మున్సిపల్ కౌన్సిలర్లు సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పటికే పది మంది కౌన్సిలర్లు వైసీపీ నుంచి టీడీపీలోకి రాగా, తాజాగా సోమవారం మరో ఆరుగురు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వీరిలో ఐదుగురికి మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో 6వ వార్డు కౌన్సిలర్ సూరిశెట్టి సుభద్రాదేవి, 8వ వార్డు కౌన్సిలర్ మంతెన నాగలక్ష్మి, 9వ వార్డు కౌన్సిలర్ వాసంశెట్టి శ్రీను, 10వ వార్డు కౌన్సిలర్ మొల్లేటి ప్రభావతి, 21వ వార్డు కౌన్సిలర్ కోలా శ్రీను ఉన్నారు. వైస్‌చైర్‌పర్సన్, 28వ వార్డు కౌన్సిలర్ కుచ్చర్లపాటి రూపాదేవి హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలసి టీడీపీలో లాంఛనంగా చేరారు. వీరి చేరికతో తుని మున్సిపల్ కౌన్సిల్లో తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఓటుతో కలిపితే టీడీపీ బలం 17కి చేరింది.

పరువు దక్కించుకునేందుకే రాజీ'డ్రామా'

మున్సిపల్ కౌన్సిల్ మూకుమ్మడి రాజీనామాలకు మాజీ మంత్రి దాడిశెట్టి ఆదేశించినప్పటికీ వైసీపీ కౌన్సిలర్లు పెడచెవిన పెట్టడంతో చేసేది లేక పరువు దక్కించుకునే ప్రయత్నాలకు వైసీపీ దిగింది. చైర్‌పర్సన్‌తో రాజీనామా చేయించి బరి నుంచి తప్పించుకునేందుకు తంటాలు పడింది. టీడీపీ, వైసీపీ బలాబలాల్లో స్పష్టమైన తేడా వచ్చేయడంతో టీడీపీపై నెపం వేసేందుకు రాజా రాజీనామా డ్రామాను తెర ముందుకు తెచ్చారు. అవిశ్వాసం ద్వారా ఎలాగూ పదవీ గండం తప్పదని భావించినట్టు తెలుస్తోంది.

చైర్‌పర్సన్ అటు.. వైస్ చైర్‌పర్సన్ ఇటు

తాజా పరిణామాలతో తుని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికలో టీడీపీ గెలుపు లాంఛనమేనని తెలుస్తోంది. ప్రస్తుతం రాజీనామాతో చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి సాధారణ కౌన్సిలర్‌గా కొనసాగుతారు. వైస్ చైర్‌పర్సన్ కుచ్చర్లపాటి రూపాదేవి వైసీపీ వైస్‌చైర్‌పర్సన్ టీడీపీలో చేరిపోవడంతో ఆమె కొత్త చైర్‌పర్సన్ ఎన్నికయ్యే వరకు బాధ్యతలు నిర్వర్తించే అవకాశమూ ఉంది.



తునిలో మీడియాతో మాట్లాడుతున్న నాయకులు

చైర్‌పర్సన్ భర్త వైఖరితోనే..

- టీడీపీ నాయకులు

మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి భర్త వైఖరితోనే వైసీపీ నుంచి కౌన్సిలర్లు బయటకొస్తున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇనిగంటి సత్యనారాయణ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. మాజీ మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి మాట్లాడుతూ ప్రస్తుతం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన సుధారాణి పరువు కాపాడుకోవాలనే రాజీనామాకి సిద్ధపడినట్టు తెలుస్తోందన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల గణేష్, కుక్కడపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవల్లో నాణ్యత పెంచాలి : కలెక్టర్

జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవల్లో నాణ్యత, ప్రజల సంతృప్తిస్థాయి పెంచేలా తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సేవల్లో ప్రజాభిప్రాయంపై జిల్లా అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల రెవెన్యూ, వివిధ శాఖల జిల్లా అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు అందించడంలో కాకినాడ జిల్లాను రాష్ట్రంలో మంచి స్థానంలో నిలిపేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పారదర్శక పాలన అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఐవీఆర్ఎస్, వాట్సాప్, క్యూఆర్ కోడ్ విధానంలో ఆర్టీజీఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నట్టు తెలిపారు. ఆసుపత్రులు, దేవాలయాలు, మున్సిపాలిటీలు, ఆర్టీసీ, హెచ్‌వోడీ కార్యాలయాలు, రెవెన్యూ, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్, వైద్యసేవలు, పురపాలక సేవలలో పన్నులు, ఇసుక విక్రయాలు, నిత్యవసర సరుకులు పంపిణీ, దీపం-2 పథకం అమలు తీరు తదితర సేవలపై ప్రజాభిప్రాయసేకరణకు ఐవీఆర్ఎస్. వాట్సాప్, క్యూఆర్ కోడ్ విధానం అమలవుతుందన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు కావాల్సిన అన్ని రకాల ధ్రువపత్రాలు పొందేలా ప్రభుత్వం వాట్సాప్ నెంబర్, క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వంలో అన్ని సేవలు ఆన్‌లైన్ చేయాలన్నదే ప్రభుత్వం ఆలోచన అని రేషన్‌కార్డుల మొదలు అన్ని సేవలు ప్రజలకు చాలా సులభంగా ఆన్‌లైన్‌లోనే అందించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. అన్నిశాఖల వాట్సాప్ గవర్నెన్స్‌లో ఇంటిగ్రేటెడ్ అవ్వాలన్నారు. వాట్సాప్ ద్వారా వివిధ ప్రభుత్వ సేవలు అందాలంటే 95523 00009 నెంబర్‌కి వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేయాలన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా యాప్ ఓపెన్ అవుతుందని, మీకు కావలసిన పౌరసేవలను ఎంచుకోవచ్చునన్నారు. అలాగే కులధ్రువపత్రం, ఆదాయం, మ్యారేజ్ తదితర సర్టిఫికెట్లు ఈ వాట్సాప్ ద్వారానే పొందవచ్చన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ భావన, వివిధ శాఖల అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాకలెక్టర్ షాన్‌మోహన్


హర్యానా వర్సెస్ ఉత్తరాఖండ్ సెక్రటేరియట్


గోల్ కొడుతున్న ఆంధ్ర జట్టు కెప్టెన్



ఆంధ్ర సెక్రటేరియట్ వర్సెస్ మహారాష్ట్ర సెక్రటేరియట్





హాకీ చలాకీ

కాకినాడలో పదో రోజుకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు
పురుషులు, మహిళల విభాగాల్లో సత్తా చాటుతున్న క్రీడాకారులు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటులో సోమవారం వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లకు సంబంధించి మొత్తం 8 మ్యాచ్‌లు జరిగాయి. డీఎస్డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు పోటీలను పర్యవేక్షించారు. పురుషుల విభాగంలో... ఆర్ఎస్సీ రాయపూర్, ఆర్ఎస్సీ జైపూర్ మధ్య మ్యాచ్‌లో ఆర్ఎస్సీ రాయపూర్ జట్టు 3-0 తేడాతో విజయం సాధించింది. హర్యానా సెక్రటేరియట్, కేరళ సెక్రటేరియట్ మధ్య మ్యాచ్‌లో హర్యానా సెక్రటేరియట్ 6-1 తేడాతో గెలుపొందింది. ఉత్తరాఖండ్ సెక్రటేరియట్, కర్ణాటక సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌ను 3-1 తేడాతో ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ కైవసం చేసుకుంది. హిమాచల్‌ప్రదేశ్ సెక్రటేరియట్, ఢిల్లీ సెక్రటేరియట్ మధ్య మ్యాచ్‌లో ఢిల్లీ సెక్రటేరియట్ 4-2 తేడాతో విజయం సొంతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, మహారాష్ట్ర సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ జట్టు 3-1 తేడాతో విజయం సాధించింది. మహిళల విభాగంలో... ఒడిశా సెక్రటేరియట్, తెలంగాణ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిశా సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. హర్యానా, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ జరిగిన మ్యాచ్‌లో హర్యానా సెక్రటేరియట్ జట్టు 3-0 తేడాతో గెలిచింది. బిహార్, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో బిహార్ సెక్రటేరియట్ 7-2 తేడాతో విజయం సాధించింది.


కేరళ సెక్రటేరియట్ వర్సెస్ హర్యానా సెక్రటేరియట్


మ్యాచ్‌ను వీక్షిస్తున్న దృశ్యం

సాంస్కృతిక ప్రదర్శనలు అలరిస్తున్నాయి



ఎ.శ్రీనివాస్, డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీ, కల్చరల్ ప్రోగ్రామ్స్ ఇన్‌చార్జి

ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరిస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటలతో అలసిపోయిన క్రీడాకారులకు వినోదంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. జాయింట్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రోగ్రామ్స్‌ను డిజైన్ చేశారు. వీటికి క్రీడాకారులతో పాటు స్థానికుల నుంచి మంచి స్పందన వస్తోంది. జాతీయ స్థాయి టోర్నీని మన కాకినాడలో నిర్వహించుకోవడం గర్వకారణంగా ఉంది. అందుకు తగ్గట్టుగానే ప్రోగ్రామ్స్ కూడా ఏర్పాటు చేశాం. కలెక్టర్ షాన్ మోహన్ ఆర్డీవోలను, హెచ్‌వోడీలను టోర్నమెంటులో ఇన్వాల్వ్ చేస్తూ టోర్నీని సక్సెస్ ఫుల్‌గా జరిపిస్తున్నారు.

కార్పొరేషన్ (కాకినాడ), ఆంధ్రజ్యోతి

క్రీడాకారుల అలవాట్లకు తగ్గట్టుగానే ఆతిథ్యం



కేఎస్వీ కాశీవిశ్వేశ్వరరావు, సెట్రాజీ సీఈవో

సివిల్ సర్వీసెస్ హాకీ నేషనల్ టోర్నమెంటుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులను దృష్టిలో పెట్టుకున్నాము. నార్త్, సౌత్ క్రీడాకారుల ఆహారపు అలవాట్లకు తగ్గట్టుగా ఆతిథ్యం ఇస్తున్నాం. సాయంత్రం వేళ సాంస్కృతిక ప్రదర్శనలతో క్రీడాకారులు సేదతీరుతున్నారు. కలెక్టర్, జేసీలు ప్రోగ్రామ్‌ల కన్వీనర్లు, సభ్యులతో నిరంతరం మాట్లాడుతూ సమన్వయపరచడంతో టోర్నమెంటును సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించగలుగుతున్నాం.

కార్పొరేషన్ (కాకినాడ), ఆంధ్రజ్యోతి


ఇంజనీరింగ్ విద్యార్థి శ్రీధర్ స్మారక వాలీబాల్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

అమ్మ మనసును బాధ పెట్టకండి

నన్నయ విశ్వ విద్యాలయం ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్ల జోలికి పోవద్దని, రోడ్లపై జాగ్రత్తగా ప్రయాణం చేయండని తాను వీసీగా కాకుండా అమ్మలా చెప్తున్నానని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. పిల్లలకు జరగరానిది జరిగితే తల్లి మనసు విలవిలలాడిపోతుందని, అమ్మ మనసును బాధ పెట్టవద్దని కోరారు. నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ ఈసీఈ విద్యార్థి ఎస్.శ్రీకాంత్ గత ఏడాది మృతి చెందాడు. అతడి పేరిట శ్రీకాంత్ స్మారక వాలీబాల్ టోర్నమెంటును సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ... తాను పెద్ద కుమారుడు తేజ్‌నయన్‌ను 1989లో, చిన్న కుమారుడు సిద్ధార్థ్‌ను 2010లో పోగొట్టుకున్నానన్నారు. ఇద్దరు పిల్లలనూ దూరం చేసిన దేవుడు తనకు ఇప్పుడు ఇంతమంది పిల్లలను ఇచ్చాడన్నారు. ఒక బిడ్డను పోగొట్టుకుంటే అమ్మ మనసు ఎంత బాధపడుతుందో తనకు తెలుసన్నారు. మీరంతా బాగా చదువుకుని తల్లిదండ్రులకు అండగా నిలవాలని కోరారు. తాను వీసీగా కాకుండా మీ అందరికీ అమ్మలా వచ్చానని చెప్పారు. ఏ పని చేసినా కుటుంబాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని, అప్పుడే భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు బి.సుధాకిరణ్, బి.కృష్ణ, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభ సభలో మాట్లాడుతున్న ప్రసన్నశ్రీ


హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.34 కోట్లు

బంగారం 30 గ్రాములు, వెండి కిలో, 34 విదేశీ కరెన్సీ లభ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు ఎన్వీఎస్వీ ప్రసాదరాజు, టీవీఎస్ఆర్ ప్రసాద్ పర్యవేక్షణలో సోమవారం తెరిచి లెక్కించారు. 31 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.1,09,68,428, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.21,50,593... మొత్తం రూ.1,34,01,911 ఆదాయం లభించింది. బంగారం 30 గ్రాములు, వెండి కిలో, 34 విదేశీ కరెన్సీ నోట్లు లభించాయి. క్షేత్రపాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.2,82,890 లభించినట్టు ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. లెక్కింపులో అర్చకస్వాములు, గ్రామస్తులు, శ్రీవారి సేవకులు, కెనరా బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.




కుక్కుటేశ్వర స్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్ల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కనుల పండువగా కుక్కుటేశుని కల్యాణం

పిఠాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసియున్న రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అలంకారం చేసి పుష్పాలతో అలంకరించిన కల్యాణ వేదికపై ఆశీనులు గావించారు. ఆస్థాన వేద పండితుడు ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనాపాఠీ, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు ఆచార్య బ్రహ్మత్వంలో, అర్చకుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల శిరస్సుపై జీలకర్ర, బెల్లం ఉంచిన అనంతరం మాంగల్యధారణ జరిగింది. అర్చకులు పోటీపడుతూ స్వామి, అమ్మవార్లపై తలంబ్రాలు వేశారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, మంగళ సూత్రాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ దంపతులు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ప్రసాదరావు సమర్పించారు. కల్యాణోత్సవాన్ని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ఆలయ అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. కల్యాణానికి ముందు వాసవి మహిళా భక్త బృందం సభ్యుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

వైభవంగా భీమేశ్వరుని కల్యాణం

సామర్లకోట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో కుమార రామ భీమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరి అమ్మవార్ల దివ్య కల్యాణం సోమవారం రాత్రి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పట్టణ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి ఆలయానికి తీసుకొచ్చారు. కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో రాత్రి పదకొండు గంటలకు కల్యాణ తంతును ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాల శర్మ, సన్నిధిరాజు వెంకన్నబాబు, కొంతేటి భీమేశ్వర శర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం తరపున కార్యనిర్వహణాధికారి సుబ్బారావు దంపతులు స్వామివారికి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలను సమర్పించారు. కల్యాణ ప్రక్రియను తణుకుకు చెందిన పండితుడు శర్మ చక్కగా వివరించారు. గంజి బూరిబాబు కుటుంబ సభ్యులు ముత్యాల తలంబ్రాలు అందజేశారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు.


కల్యాణాన్ని తిలకిస్తున్న పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, భక్తులు


భీమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరి అమ్మవార్ల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకస్వాములు


భారీ క్రేన్‌తో చెట్టును నాటుతున్న దృశ్యం

90 ఏళ్ల రావిచెట్టుకు పునరుజ్జీవం

90 ఏళ్ల వయసు కలిగిన రావిచెట్టును రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో పునరుజ్జీవింపజేశారు. ఈ చెట్టును వాహనంపై తీసుకొచ్చి భారీ క్రేన్ సహాయంతో జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో పెద్ద గొయ్యి తీసి సోమవారం నాటారు. రాజమహేంద్రవరంలోని కోర్టుల సముదాయంలో భవనాల నిర్మాణంలో భాగంగా తొలగించిన ఈ రావిచెట్టును రోటరీ ఐకాన్స్ ప్రతినిధులు గుర్తించి ఇక్కడకు తెచ్చారు. తొలుత ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ (అడ్మిన్), ఎల్.అర్జున్ (క్రైమ్స్), చెంచిరెడ్డి (ఏఆర్), ఎస్బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఏఆర్ డీఎస్పీ రవికుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



విస్తృతంగా చికెన్ మేళాలు

- బర్డ్‌ఫ్లూ లేదన్న అధికారుల సూచనలతో వెంకోబ్, హేచరీల ఆధ్వర్యంలో కార్యక్రమాలు
- పిఠాపురంలో చికెన్ పకోడి, గుడ్లు పంపిణీ
- కొత్తపల్లి, తునిల్లో చికెన్‌తో భోజనాలు


కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో చికెన్‌మేళా క్యూలో పాల్గొన్న ప్రజలు

పిఠాపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో సోమవారం సాయంత్రం చికెన్ అండ్ ఎగ్‌మేళా నిర్వహించారు. వెంకోబ్ చికెన్ ఆధ్వర్యంలో ఉచితంగా చికెన్ పకోడి, ఉడకపెట్టిన గుడ్లు పంపిణీ చేశారు. వీటి కోసం ప్రజలు భారీగా తరలివచ్చారు. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో చికెన్, గుడ్లపై ప్రజల్లో నెలకొన్న అపోహను తొలగించేందుకు ఈ మేళా నిర్వహించారు. ఉడకపెట్టి వండిన చికెన్, గుడ్లు వల్ల ఏ విధమైన ఇబ్బంది ఉండదని ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ఈ మేళా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో..

కొత్తపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉప్పాడకు చెందిన చికెన్ వ్యాపారస్తులు సోమవారం బీచ్‌రోడ్డు సెంటర్‌లో చికెన్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో 200 కిలోల చికెన్ తయారుచేశారు. 2వేల గుడ్లను ఉడకపెట్టారు. చికెన్, ఎగ్‌లను భుజించేందుకు తీర ప్రాంతాలకు చెందిన ప్రజలతోపాటు ఉప్పాడనుంచి బీచ్‌రోడ్డు మీదుగా కాకినాడ వెళ్లే ప్రయాణికులు క్యూకట్టారు. ఈ సందర్భంగా వెమ్‌కోబ్ చికెన్ ఉత్పత్తిదారులు మాట్లాడుతూ చికెన్‌లో బర్డ్‌ఫ్లూ వైరస్ లేదని జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకే పలుచోట్ల చికెన్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు.

తుని పట్టణంలో..

తుని రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తునిలో రెండుచోట్ల చికెన్, కోడిగుడ్లతో ఉచితంగా విందు ఏర్పాటు చేయడంతో ప్రజలు ఎగబడ్డారు. తుని పట్టణంలో సీఎంఆర్ సెంటర్‌తోపాటు అన్న క్యాంటీన్ పక్కన చికెన్‌తో ఉచిత భోజనాల శిబిరంవద్ద సందడి నెలకొంది. ఈ సందర్భంగా వెంకటేశ్వర హేచరీస్ నిర్వాహకులు మాట్లాడుతూ చికెన్, గుడ్లు కొనుగోలులో ప్రజల్లో అపోహలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు తలపెడుతున్నామని తెలిపారు.



పిఠాపురం పట్టణం ఉప్పాడ సెంటర్‌లో చికెన్‌మేళాకు తరలివచ్చిన ప్రజలు

కోడిగుడ్డు ధర.. కిందకు..



- బర్డ్‌ఫ్లూ ప్రభావంతో తగ్గిన గుడ్డు రేటు
- రూ.6.60 పైసల నుంచి రూ.4కి చేరిన ధర

గండేపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గుడ్డు ధర కిందకు పడిపోయింది. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో ఎక్కడికక్కడ కోడిగుడ్డు వాడకం తగ్గింది. దీంతో గుడ్డు ధర అమాంతంగా తగ్గిపోయింది. నెలరోజుల కిందట వరకు గుడ్డు రేటు రూ.6నుంచి రూ.6.50వరకు పలికేది. ప్రస్తుతం రూ.4 పలుకుతోంది. కోళ్ల ఫారాల్లో కూడా గుడ్లు ఎగుమతులు ఆగిపోయాయి. దీంతో ఫారం నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటివరకు లాభాలు చూసిన వాళ్లంతా నష్టాలు ఎదుర్కొంటున్నారు. రోజురోజుకు నష్టాలు ఎక్కువై ఫారం ఉంచాలా తీసేయాలా అన్నస్థితిలో ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో 20లక్షల కోళ్లు ఉండగా ఉమ్మడి జిల్లాలో కోటి20 లక్షలు ఉన్నాయి. వాటి మీదే నిర్వాహకులు బతుకు జీవనం సాగిస్తున్నారు. ఈ వైరస్ వల్ల గుడ్లు రేటు తగ్గిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతోపాటు ఒక్క గుడ్డు తయారు కావడానికి రూ.5 వరకు ఖర్చవుతుందని, కానీ రేటు మాత్రం రూ.4 పలుకుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో కాకినాడ జిల్లా ఎస్పీ ప్రత్యేక పూజలు


ఎస్పీ దంపతులకు స్వాగతం పలుకుతున్న దేవస్థానం పీఆర్వో

అన్నవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

అన్నవరం దేవస్థానం టెండర్ ప్రకటనలో కాలపరిమితిగా భావించాలి: ఈవో

అన్నవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానానికి సంబంధించి ఆంధ్రజ్యోతిలో సోమవారం ఇచ్చిన టెండర్ ప్రకటనలోని వివరాల్లో మొదటి వరుసలో ఉన్న షెడ్యూల్ ఖరీదు స్థానంలో కాలపరిమితి అని భావించాలని దేవస్థానంఈవో వీర్ల సుబ్బారావు కోరారు. ఆసక్తి కలిగి టెండర్‌కం ఈ ప్రొక్యూర్‌మెంట్‌లో పాల్గొనేగుత్తేదారులు ఈవిషయాన్ని గమనించాలన్నారు.

‘అన్నవరం’లో సమూల మార్పులు


భక్తుల నుంచి అభిప్రాయాలు తెలుసుకుంటున్న కలెక్టర్ షాన్‌మోహన్

- అన్నవరంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పర్యటన
- భక్తులనుంచి అభిప్రాయాల సేకరణ
- అన్నదానంలో భక్తులు వేచి ఉండకుండా సిట్టింగ్‌తోపాటు బఫే విధానం
- గదుల కేటాయింపునకు ఇకపై నగదు రహిత విధానం అమలు
- ఈవో, చైర్మన్, సిబ్బందితో సమీక్ష
- ఇకపై ప్రతినెలా సమీక్ష

అన్నవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో భక్తులకు సంతృప్తికరమైన సేవలందుతున్నాయా లేదా అనేదానిపై ప్రభుత్వం చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం చివరి స్థానం రావడంతో కాకినాడ జిల్లా కలెక్టర్ సోమవారం స్వయంగా రంగంలోకి దిగి భక్తుల అభిప్రాయాలు తీసుకున్నారు. ముందుగా సత్యదేవుడిని దర్శించుకున్న ఆయన క్యూలైన్ ద్వారా దర్శనానికి విచ్చేసిన భక్తుల ఇబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వారినుంచి సంతృప్తికరమైన జవాబు రావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

మరుగుదొడ్ల నిర్వహణపై అసంతృప్తి

పశ్చిమ రాజగోపురంవద్ద మహిళా భక్తురాలు సత్రం గదులు తీసుకునే సమయంలో కేవలం నగదు లావాదేవీలు మాత్రమే జరుపుతున్నారని, డిజిటల్ పేమెంట్‌లు లేవని తెలపడంతో సత్వరమే నగదు రహిత సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్నప్రసాదం స్వీకరించే భక్తులు గంట సమయం క్యూలైన్‌లో వేచిఉన్నామని కలెక్టర్‌కు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఒక హాలులో కేవలం 425మంది కూర్చుని తినేందుకు మాత్రమే అవకాశం ఉందని తెలపడంతో పై అంతస్తులో బఫే విధానం అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శానిటేషన్ నిర్వహణకు సంబంధించి వృథాగా పడిఉన్న సామాన్లను గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల నిర్వహణ సరిగాలేదన్నారు. నిరుపయోగ సామానంతా ఒకచోట స్టోర్స్‌కు చేర్చుకోవాలని, మరుగుదొడ్ల నిర్వహణ తదితర ఫొటోలు తనకు ప్రతిరోజూ సాయంత్రం వాట్సాప్‌లో పంపించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావును ఆదేశించారు. ఆదివారం రాత్రి 9గంటలకు విచ్చేసిన భక్తురాలికి గదులు ఖాళీ లేవని చెప్పడంతో సీఆర్వో కార్యాలయంలో ఆదివారం రాత్రికి జరిగిన గదుల బుకింగ్‌ను పరిశీలించారు.

‘అభివృద్ధి కంటికి కనిపించాలి..’

అనంతరం ఈవో ఈర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, అన్నివిభాగాల సూపరింటెండెంట్లు, ఇంజనీరింగ్ అధికారులు, ఏఈవోలతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పలుచోట్ల నేమ్‌బోర్డులు పూర్తిస్థాయిలో కనిపించలేదని ప్రధానంగా జల ప్రసాదం కేంద్రాలవద్ద అక్షరాలు క్లారిటీగా లేవని ప్రతిచోట పరిశీలించి సరిచేయాలని ఈవోకు సూచించారు. ప్రసాదం విక్రయ కేంద్రాల్లో సిబ్బంది గ్లౌజ్‌లు, మాస్కులు ధరించాలని ఆదేశించారు. తల్లులు పిల్లలకు పాలిచ్చే కేంద్రం ఎప్పుడూ తెరిచి ఉంచడంతోపాటు మహిళా ఉద్యోగిని అక్కడ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇకపై ప్రతినెలా ఒకసారి రివ్యూ చేస్తామని మౌలిక వసతుల కల్పనలో అభివృద్ధి కంటికి కనిపించాలని కాగితాలకు పరిమితం కాకూడదన్నారు. వచ్చేనెల రివ్యూలో దేవస్థానం భూములు, స్థలాల ఆక్రమణలపై చర్చిస్తానన్నారు. ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం చివరిస్థానం రావడం బాధనిపించిందన్నారు. సిబ్బంది భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సత్రంగదుల ఖాళీల వివరాలు చెప్పడంలో కౌంటర్ సిబ్బందినుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

అత్యాచారం కేసులో నేరస్తుడికి పదేళ్ల జైలు

శిక్షతోపాటు రూ.5వేల జరిమానా

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో నిందితుడిపై అభియోగాలు రుజువు కావడంతో కోర్టు జైలుశిక్ష విధించింది. రాజమహేంద్రవరంలోని ప్రకాశంనగర్ సీఐ ఆర్ఎస్‌కే బాజీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలోని పీఅండ్‌టీ కాలనీకి చెందిన వాసంశెట్టి దేవికుమార్ లాలాచెరువుకు చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో నమ్మించాడు. పలుమార్లు శారీరక వాంఛ తీర్చుకున్నాడు. వివాహం చేసుకోవాలని ఆమె కోరగా తిరస్కరించాడు. దీనిపై ఆమె ఫిర్యాదుతో 2023, మే 20న కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ 8వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి, మహిళలపై నేరాల విచారణ ప్రత్యేక న్యాయస్థానం జడ్జి వై.వెన్నయ్య నాయుడు సోమవారం తీర్పు చెప్పారని సీఐ తెలిపారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్ బాబు, సీఐలు బాజీలాల్, పీఈ పవన్ కుమార్ రెడ్డి, పీసీ రమేశ్‌ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

చెట్టుకు ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి


ఉరేసుకుని మృతి చెందిన వ్యక్తి

గండేపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారిలో పోలవరంగట్టున గుర్తు తెలియని వ్యక్తి సోమవారం చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 35-40ఏళ్ల వయస్సులోపు ఉండి నీలం, పసుపు, నలుపు రంగుల పొడుగు చేతుల చొక్కా, బిస్కెట్ రంగు ప్యాంట్ కలిగి ఉన్నాడన్నారు. ఆ చెట్టుపక్కనే సైకిల్ పడిఉందన్నారు. స్థానిక వీఆర్‌ఏ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. దీనిపై గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మృతుడి ఆచూకీ తెలిస్తే జగ్గంపేట సీఐ శ్రీనివాస్ 9440796529, గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు 9440904841 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రైలునుంచి జారిపడి..

సామర్లకోట,ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో వేట్లపాలెం-జి.మేడపాడు రైల్వేట్రాక్‌పై సోమవారం 35ఏళ్ల వయస్సుగల పురుష మృతదేహాన్ని రైల్వేపోలీసులు కనుగొన్నారు. రైల్వే కీమెన్ అందించిన సమాచారంతో వారు సంఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. గుర్తుతెలియని రైలు ఢీకొనడం లేదా రైలునుంచి జారిపడడం జరిగి ఉంటుందనిపోలీసులు భావిస్తున్నారు. మృతదేహం కుడిచేతి ఎల్బోపై ఈశ్వరి అని తెలుగులో రాసిఉందని, కుటుంబసభ్యులు ఉంటే తమను సంప్రదించాలని కేసు దర్యాప్తు చేస్తున్న రైల్వే పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తూ ఆటోనుంచి జారి పడి..
నాలుగేళ్ల బాలుడి మృతి

- కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలో ఘటన
- పెళ్లింట విషాదం


పవన్‌శ్రీనివాస్(పాత చిత్రం)

పి.గన్నవరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బాబాయ్ పెళ్లికి వచ్చిన ఆ బాలుడిని ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. ఆ బాలుడు మృతి.. పెళ్లింట విషాదం మిగిల్చింది. కోనసీమ జిల్లా పి.గన్నవరం అక్విడెక్టుపై ప్రమాదవశాత్తూ ఆటోనుంచి పడిపోయి నాలుగేళ్ల బాలుడు మృతిచెందాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి..
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు ఆదిమూలంవారిపాలేనికి చెందిన చిలకలపూడి శివనాగేంద్ర కుటుంబం కొంతకాలంగా ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు.ఈక్రమంలో వచ్చేనెల 1న తమ్ముడు వివాహం కావడంతో ముందుగా భార్య, పిల్లలు సొంత గ్రామానికి వచ్చారు. సోమవారం ఆదిమూలంవారిపాలెంనుంచి శివనాగేంద్ర కుమారుడు పవన్ శ్రీనివాస్(4) తన బాబాయ్(వరసకు) సాయంతో లోడు ఆటోలో రాజోలుమండలం శివకోడు బంధువులు ఇంటికి వెళ్లాడు. శివకోడునుంచి తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో పి.గన్నవరం అక్విడెక్టు వద్దకు వచ్చేసరికి ఆటో డోర్ ఊడిపోవడంతో ముందు కూర్చున్న చిన్నారి రోడ్డుపై పడిపోయాడు. దీంతో పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించగా బలమైన గాయం కావడంతో ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు సూచనతో అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పవన్‌శ్రీనివాస్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అతడికి తండ్రి శివనాగేంద్ర, తల్లి స్వర్ణ, సోదరుడు రోహిత్ ఉన్నారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తమ కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని ఆ కుటుంబం రోదిస్తున్న తీరు కంటనీరు పెట్టిస్తోంది.

పాఠశాల భవనం పైనుంచి దూకేసిన విద్యార్థిని

- తండ్రి మందలించడమే కారణమంటున్న సహచర విద్యార్థినులు
- మండపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఘటన
- చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలింపు

మండపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడన్న కోపంతో మండపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఆరో తరగతి విద్యార్థిని పాఠశాల భవనంపైనుంచి కిందకు దూకేసిన సంఘటన ఇది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ఇంటర్వెల్ సమయంలో దూకేసి..

మండపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌కు దగ్గర్లోని ప్రభుత్వ బాలికల హైస్కూల్లో మహ్మద్‌పౌజీ (14) ఆరో తరగతి చదువుతోంది. సోమవారం ఆమెను తండ్రి ఇంటి నుంచి పాఠశాలకు తీసుకువచ్చి బయట మందలించి కొట్టి లోపల అప్పగించాడు. తండ్రి కొట్టి.. తిట్టడంతో మనస్తాపానికి గురైన ఆమె తరగతిగదిలో సహచర విద్యార్థినులతో జరిగిన సంఘటన చెప్పి బాధపడింది. తన తండ్రి తనను మందలించాడని తాను పాఠశాల భవనంపైనుంచి దూకేస్తానని చెప్పింది. ఈ విషయం బయటకు రాకముందే ఆమె పాఠశాల ఇంటర్వెల్ సమయంలో బయటకు వచ్చి పాఠశాల మొదటి అంతస్తు నుంచి కిందకు దూకేసింది. ఆమెను తక్షణమే వైద్యచికిత్స కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు మెరుగైన వైద్యంకోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించాలని సూచించారు. వెంటనే 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అక్కడ విద్యార్థిని కోలుకుంటోందని సమాచారం అందిందని పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం రామకృష్ణ తెలిపారు. ఈ సంఘటనపై పట్టణ పోలీసులకు ఏమైనా ఫిర్యాదు వచ్చిందా అని ప్రశ్నించగా తమ దృష్టికి ఆస్పత్రినుంచి సమాచారం వచ్చిందని వారు బదులిచ్చారు.

వృద్ధురాలిపై దాడి కేసులో నిందితుల అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలిపై దాడికి పాల్పడడమే కాకుండా ఆమె నగలు, నగదు తస్కరించిన కేసులో కాకినాడ పోలీసులు సోమవారం ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ సబ్‌డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎస్‌డీపీవో, ఐపీఎస్ అధికారి మనీష్ దేవరాజ్ పాటిల్ నిందితుల వివరాలను వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి.

ఇంట్లో ఒంటరిగా ఉండగా..

కాకినాడ జగన్నాథపురం యానాం రోడ్డులోని ఒంటరిగా నివసిస్తున్న తనను ఈనెల 14న రాత్రి 9 గంటల సమయంలో నలుగురు అగంతకులు దౌర్జన్యంగా లోపలికి ప్రవేశించి తన కాళ్లు, చేతులు కట్టి, నోట్లో గుడ్డలు కుక్కి, ఇష్టానుసారంగా తనను శారీరకంగా హింసించి ట్రంకు పెట్టిలో ఉన్న బంగారపు ఉంగరం, బంగారపు గాజు, రూ.60వేల నగదును అపహరించుకుపోయినట్లు బాధితరాలు 74ఏళ్ల చాగంటి శుక్రవారపు మహాలక్ష్మి కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశానుసారం, కాకినాడ ఎస్‌డీపీవో, ఐపీఎస్ అధికారి మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో సీసీఎస్ సీఐ వి.కృష్ణ, వన్‌టౌన్ లాఅండ్‌ఆర్డర్ సీఐ ఎం.నాగదుర్గారావు బృందం ఐటీకోర్ ఇన్‌స్పెక్టర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి సహకారంతో దర్యాప్తు చేపట్టారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన చాగంటి రజిత అలియాస్ దారా రజిత అలియాస్ సిరి అదే ప్రాంతానికి చెందిన దారా రఘు, కరీంనగర్‌కు చెందిన తోందిర్తి లత అలియాస్ హేమలత, అదే ప్రాంతానికి చెందిన తాటి వెంకటేష్‌లను అరెస్ట్ చేసి 6.50 గ్రాముల గంగారపు గాజు, 2.70 గ్రాముల బంగారపు ఉంగరం, రూ.30వేల నగదును పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. నలుగురు నిందితులు ఇచ్చిన వాంగ్మూలం, నిందితులకు సహకారం అందించిన ఫిర్యాది మహాలక్ష్మి ఇంట్లోని పనిమనిషి కాకినాడ జగన్నాథపురానికి చెందిన రామలక్ష్మిని పోలీసులు అరెస్ట్ చేశారు.

వరుసకు కోడలే ప్రధాన నిందితురాలు

శుక్రవారపు మహాలక్ష్మి, శ్రీరామచంద్రమూర్తి దంపతులకు సంతానం లేకపోవడంతో శంకర్ అనే బాలుడిని దత్తత తీసుకుని పెంచుకున్నట్లు ఎస్‌డీపీవో తెలిపారు. అతడు పెద్దయ్యాక ఉద్యోగ రీత్యా తెలంగాణకు వెళ్లి అక్కడ రజితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో మహాలక్ష్మి ఒంటరిగా ఉండడంతో ఆమెలో దుర్బుద్ధి పుట్టింది. పనిమనిషితోపాటు తన కుటుంబసభ్యుల సహకారంతో రజిత ఈనీచానికి ఒడిగట్టినట్లు ఎస్‌డీపీవో తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకుని చోరీసొత్తును స్వాధీనం చేసుకున్న సీఐలు కృష్ణ, నాగదుర్గారావ్, చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు వినయప్రతాప్, పీసీ స్వామినాయుడులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ట్రాఫిక్ మళ్లింపు

- సామర్లకోటకు వెళ్లాల్సిన దారుల్లో వాహనాల రూట్ల మార్పు

సామర్లకోట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సామర్లకోటలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సామర్లకోట మీదుగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాల ట్రాఫిక్‌ను వేరే రూట్లలో మళ్లించేలా తాత్కాలిక మార్పులు చేపట్టినట్లు సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకూ మార్పు చేసిన ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. రాజానగరం నుంచి కాకినాడ వెళ్లే భారీవాహనాలు కత్తిపూడి నుంచి అచ్చంపేట జంక్షన్ మార్గంలో కాకినాడ వెళ్లాల్సిఉంది. రాజానగరం, పెద్దాపురం, సామర్లకోట మీదుగా కాకినాడ వెళ్లే లైట్ వెహికల్స్, ఆటోలు, ఆర్టీసీ బస్సులు మాత్రమే ఈ మార్గం వైపు పంపుతారు.

కాకినాడ-రాజానగరం మార్గంలో..

కాకినాడ నుంచి రాజానగరం మార్గం వైపు వెళ్లే భారీవాహనాలు కాకినాడ, అచ్చంపేట, కత్తిపూడి మీదుగా రాజానగరం వెళ్లాల్సి ఉంటుంది. కాకినాడనుంచి రాజానగరం వెళ్లే లైట్ వెహికల్స్, పాసింజర్ ఆటోలు, ఆర్టీసీ బస్సులు మాత్రమే సామర్లకోట,పెద్దాపురం వైపునుంచి పంపుతారు.

ద్వారపూడి-సామర్లకోట మార్గంలో..

ద్వారపూడి, అనపర్తి, బిక్కవోలునుంచి సామర్లకోట మీదుగా కాకినాడ వెళ్లాల్సిన భారీ వాహనాలు సామర్లకోట ఫ్లైఓవర్‌బ్రిడ్జి మీదుగా సామర్లకోట రైల్వేస్టేషన్, పిఠాపురం రోడ్డు నుంచి కాకినాడ మార్గం వైపు పంపుతారు.

పెద్దాపురం-కాకినాడ మార్గంలో..

పెద్దాపురం నుంచి కాకినాడ వెళ్లే భారీ వాహనాలు కూడా ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం నుంచి బ్రౌన్‌పేట మీదుగా పిఠాపురం మీదుగా వెళ్లాల్సిఉంది. వాహనదారులు, ప్రయాణికులు పోలీసు అధికారులకు, సిబ్బందికి సహకరించాలని సీఐ కృష్ణభగవాన్ కోరారు. ఈ సందర్భంగా సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు కూడా పాల్గొన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్: పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం కావాలని, బాధితులకు తగు పరిహారం అందాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు వివిధ చిట్‌ఫండ్ సంస్థలు, ఏపీఈపీడీసీఎల్, బ్యాంక్‌ల ప్రతినిధులు, ఆయా సంస్థల న్యాయవాదులతో ఆమె సోమవారం సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించి దిశానిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను గుర్తించి ఆ జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్ ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడిన ఇద్దరి అరెస్ట్

తాళ్లరేవు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడి దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్న ఇద్దరు యువకులను కోరింగి ఎస్ఐ పి.సత్యనారాయణ సోమవారం అరెస్టు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లరేవులోని నందిరేవు సంతమార్కెట్‌కు చెందిన పోతాబత్తుల ఏసురాజు ఈనెల 18న ఓ వృద్ధురాలి ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలో బంగారం చైన్, నల్లపూసల తాడును లాక్కుని అపహరించుకుపోయాడు. పోలీసులు నిందితుడిని పట్టుకుని 2.5కాసులు బంగారం రికవరీ చేశారు. కాకినాడ రూరల్‌కు చెందిన బొడ్డు అంజిబాబు కోరింగ యల్లమ్మగుడి వద్ద హుండీని దొంగిలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితులనుంచి వస్తువులను స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్‌కు పంపుతున్నట్టు ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు.

'క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలి'

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా నివారణ సులభమని వైద్య సిబ్బంది తెలిపారు. తాటిపర్తిలో క్యాన్సర్‌లో రకాలు, వాటిని ఎలా గుర్తించవచ్చు, వైద్యఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న స్ర్కీనింగ్‌పై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజరు భాషా, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

కుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు అంకుర్పారణ చేస్తున్న దృశ్యం



గజవాహనంపై ఉత్సవమూర్తులను ఎదురుసన్నాహాలకు తీసుకువస్తున్న దృశ్యం

పిఠాపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్లకు పంచామృతస్నానం నిర్వహించారు. ఉత్సవాలకు అంకుర్పారణ పూజలు జరిగాయి. ఆలయ ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ధ్వజారోహణ జరిగింది. కుక్కుటేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన, రాజరాజేశ్వరీ దేవికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆలయం వద్ద మహిళా భక్తులు పసుపుపోటు వేశారు. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు పెండ్లి అలంకారం జరిగింది. సాయంత్రం కైతేపల్లి శ్యామ్‌సుందర్‌శర్మ మరియు సోదరుల దంపతులు స్వామిని పెండ్లికుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించారు. గజవాహనంపై గ్రామోత్సవం అనంతరం రామకృష్ణ వాసవీ కన్యకా పరమేశ్వరీ కళ్యాణమండపం వద్ద ఆర్యవైశ్యభక్త బృందం సభ్యులు ఎదురు సన్నాహాలు నిర్వహించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆస్థాన వేదపండితులు ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనాపాఠీ, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు ఆచార్య ప్రహ్మత్వంలో పూజాది కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ప్రసాదరావు, సూపరింటెండెంట్ వీరభద్రరావు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎదురు సన్నాహాలు

పిఠాపురం పెదబజారు సమీపంలో ఉన్న రామకృష్ణ వాసవి కన్యకాపరమేశ్వరీ కల్యాణమండపం వద్ద రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి వార్లకు ఎదురు సన్నాహాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను పాదగయ క్షేత్రం నుంచి గ్రామోత్సవంగా సోమవారం సాయంత్రం పురవీధులు గుండా కల్యాణమండపం వరకూ తీసుకువచ్చారు. ఎదురుసన్నాహాలు అనంతరం ఆర్యవైశ్య భక్తులు స్వామి, అమ్మవార్లకు స్వీట్లు, పండ్లు, డ్రైఫ్రూట్స్, పసుపు, కుంకుమ సమర్పించారు. పూజలు అనంతరం భక్తులకు పానకాలు పంపిణీ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను కల్యాణక్రతువు నిమిత్తం పాదగయకు ప్రదర్శనగా తీసుకువెళ్లారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాదగయ క్షేత్రంలో నేడు...

పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం ఉదయం 6గంటలకు కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం, రాజరాజేశ్వరీదేవికి కుంకుమార్చన, సహస్ర చామంతి అర్చన, ఉదయం 8గంటలకు గ్రామోత్సవం, రాత్రి 7గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 8గంటలకు గ్రామోత్సవం జరగనున్నాయి.

దుర్గాడలో కల్యాణోత్సవాలు...

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలంలోని దుర్గాడ శివాలయంలో వేంచేసి ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చనలు జరిగాయి. స్వామి,అమ్మవార్లకు మంగళస్నానాలు అనంతరం కల్యాణాలంకారం చేశారు. మహిళలు పసుపుపోటు వేశారు. భక్తులు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

కొత్తపల్లిలో సింహాద్రి అప్పన్న కల్యాణం

కొత్తపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో సింహాద్రి అప్పన్న కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. కొత్తపల్లికి చెందిన దివంగత సర్పంచ్ చోడిశెట్టి పెద్దబూరయ్య దంపతుల కుమారులు ఆధ్వర్యంలో యాదవ కుటుంబీకుల సారథ్యంలో యవ్వనంలో ఉన్న తాడిపెద్దు(సింహాద్రి అప్పన్న)కు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అచ్చువేసే కార్యక్రమాన్ని యాదవ కులస్తుల సమక్షంలో జరిపించారు. అచ్చువేసిన సింహాద్రి అప్పన్నకు యవ్వనంలో ఉన్న ఆడ ఆవుతో శాస్త్రోక్తంగా వివాహం జరిపించారు. సామర్లకోట, తుని సమీపంలో కృష్ణాపురానికి చెందిన యాదవులు 2 బృందాలుగా తప్పెటగుళ్ళ ప్రదర్శన ఇచ్చారు. సుమారు 4వేల మందికి అన్నసమారాధన జరిగింది.

వైభవంగా ధ్వజారోహణం

కొత్తపల్లిలో శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖరస్వామి దివ్య కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి జరిగింది. స్వామివార్లకు నూతన వస్త్రాలను ఆలయ అర్చకులు రామజోగీశ్వరశర్మ, సుబ్రహ్మణ్యశర్మ సమర్పించారు. కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామాలకు భక్తులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి కల్యాణం

పెద్దాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరులో రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి దివ్య కల్యాణం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించారు.అధికంగా భక్తులు తరలివచ్చారు.



గొల్లప్రోలు మండలం దుర్గాడలో స్వామి, అమ్మవార్లకు పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తె అలంకారం చేసిన దృశ్యం



కొత్తపల్లిలో కల్యాణం చేసిన సింహాద్రి అప్పన్నను ఊరేగిస్తున్న యాదవులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కొత్తపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 27న జరిగే పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తహశీల్దార్ జి.చిన్నారావు చెప్పారు. తహశీల్దార్ కార్యాలయంలో 1 పోలింగ్ కేంద్రం, ఉప్పాడ కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 1215 మంది పురుషులు, 604 మహిళలతో పాటు మరో 20మంది కొత్త పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, కరెంటు తదితర సౌకర్యాలను కల్పించినట్టు పేర్కొన్నారు.

'సత్ప్రవర్తనతో మెలగాలి'

పెద్దాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ వి.మౌనిక అన్నారు. మండలంలోని ఆర్‌బీ పట్నం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సత్ప్రవర్తనపై ఆమె సోమవారం అవగాహన కల్పించారు. చట్టవ్యతిరేకమైన పనులకు పాల్పడకూడదని, విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకోకూడదని వివరించారు. మంచి ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం మల్లేశ్వరరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ మన్యం చిన్న, పీడీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

పెద్దాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాలుతిమ్మాపురంలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతున్నట్లు గ్రామానికి చెందిన బచ్చల రాజు ఆర్డీవో శ్రీరమణికి సోమవారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 159/2, 154లో ఉన్న ఉన్న స్థలాన్ని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించుకుంటున్నారని, ఈ స్థలంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణం చేపట్టాల్సి ఉంద న్నారు. అధికారులు స్థలాన్ని కాపాడాలని కోరారు.

చెట్టును ఢీకొన్న కారు

ఇద్దరికి గాయాలు

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కారు చెట్టును ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. పిఠాపురం మండలం బికొత్తూరు గ్రామానికి చెందిన దొడ్డి నాగు ఇటీవల కొత్త కారు కొనుగోలు చేశాడు. ఆ కారులో జగ్గంపేట నుంచి బి.కొత్తూరు వస్తుండగా వెల్దుర్తి వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరికి స్వల్పంగా గాయాలు అయ్యాయి. పిఠాపురం రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కోడి పందేలపై దాడి

ఆరుగురి అరెస్ట్

పెద్దాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిమేరు గ్రామంలో కోడి పందేల స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.13,600 నగదు, 2 మోటారు సైకిళ్లు, 2కోళ్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పట్టణ శివారులో పేకాడుతున్న ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు. వారి నుంచి రూ.10,250 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

పిఠాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణంలో బోధన సాగించాలని పిఠాపురం ఎంఈవో జి.శ్యాంబాబు సూచించారు. 120రోజుల జీవనజ్యోతి అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ ఐదోవ రోజు సోమవారం ఈసీ సీఈ డే, గ్రాడ్యుయేషన్ డే, టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఉన్న పరికరాలను వినియోగించి విద్యాబోధన ఎలా చేయాలనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఎంఈవో-2 నారాయణదాసు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ కమిషనర్ భావన సోమవారం తెల్లవారుజామున రామారావుపేట సుబ్బయ్యహోటల్, మోర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వాహణ తనిఖీ చేశారు. పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వెహిక్ యార్డుకు వెళ్లి చెత్త తరలింపు వాహనాలను పరిశీలించారు. అదనపు కమిషనర్ కెటి సుధాకర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల నిరసన

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్ సర్వీస్‌లో పని చేస్తున్న ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. గతంలో తమకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని, పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వడంతోపాటు తమ డిమాండ్లను నెరవేర్చాలన్నారు. యూనియన్ ప్రతినిధులు నరసింహరావు, సత్యనారాయణ, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా ఉపకరణాల పంపిణీ

కరప, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అరట్లకట్ట ముత్యాల సుబ్బన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ఉపకరణాలను పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన క్షత్రియ యూత్ ఫెడరేషన్ సహకారంతో 70మంది విద్యార్థులకు రూ.20వేలు విలువచేసే పరీక్ష అట్టలు, జామెట్రీ బాక్స్‌లు, పెన్నులు అందజేసినట్టు ఎంఈవో-2 పత్తి సత్యనారాయణ తెలిపారు. హెచ్ఎం పీవీ శివగిరి, ఎస్ఎంసీ ఛైర్మన్ దారా వీరబాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.



శివరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

● పాదగయ క్షేత్రంలో నాలుగు క్యూలైన్లు ఏర్పాటు ● కలెక్టర్ షాన్‌మోహన్

పిఠాపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సామాన్య భక్తుల భద్రత, సౌకర్యాలు దృష్టిలో ఉంచుకుని పిఠాపురం పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాలు(26,27,28వ తేదీలు)కు విస్తృత ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ వెల్లడించారు. పాదగయలో పలుమార్లు నిర్వహించిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశాలు, గత అనుభవాలు, ప్రజలు, పురప్రముఖులు సూచనలు మేరకు భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నామని ఆయన సోమవారం రాత్రి తెలిపారు. ఇతర రాష్ట్రాలు నుంచి వచ్చే భక్తులకు వసతిగృహం, ఏసీ డార్మెట్రీ అందుబాటులో ఉందని చెప్పారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 4 క్యూలైన్లు ఏర్పాటు చేశామని, ఇందులో 2 లైన్లు ఉచిత దర్శనాలకు ప్రత్యేకించినట్లు తెలిపారు. రూ.50, రూ.20 దర్శనాల కోసం మరో 2 క్యూలైన్లు ఉంటాయని చెప్పారు. పుష్కరిణిలో స్నానాలు ఆచరించే భక్తుల కోసం అన్ని రక్షణ చర్యలు తీసుకున్నామని తెలిపారు. మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు శాశ్వత, తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేశామన్నారు. ముందుజాగ్రత్త చర్యగా 24మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నామని,పారిశుధ్య నిర్వహణకు అదనంగా 100 మంది సిబ్బందిని నియమిస్తున్నట్లు చెప్పారు.

6 పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు

మహాశివరాత్రికి వాహనాలపై వచ్చే భక్తులు కోసం పాదగయకు 500మీటర్ల పరిసరాల్లోనే ఆరు పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వీఐపీలకు మహాశివరాత్రి రోజున మధ్యాహ్నం 2నుంచి 4గంటల వరకూ దర్శనాలు చేసుకోవచ్చని, ఇందులో ఇద్దరు లైజా న్ అధికారులను నియమించామని తెలిపారు. దర్శనాల కోసం వచ్చే వీఐపీలు సూపరింటెండెంట్ వీరభద్రరావు ఫోన్ 9963575998 లేదా కార్యనిర్వహణాధికారి జోగా సత్యనారాయణ ఫోన్ 9948024322లో సంప్రదించాలని సూచించారు. ఆలయం లోపల, బయట మూడు వైద్యశిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులందరూ భక్తిభావంతో దర్శనాలు చేసుకోవాలన్నారు. ఎవరైనా దురుసుగా ప్రవరించినా, అసాంఘిక కార్యాకలపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

సామర్లకోట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఈనెల 26న మహా శివరాత్రి ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఆలయ ఆవరణలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ విడుదల చేసిన సమాచారం మేరకు.. ఆలయంలో 24న సోమవారం ఉదయం పూజల అనంతరం రాత్రికి స్వామి, అమ్మవార్ల కల్యాణం జరుగుతుందన్నారు. 25న ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహిస్తారన్నారు. 26న రాత్రి 1 గంట నుంచి మరుసటి రోజు 27 రాత్రి వరకూ భక్తులకు దర్శనాల ఏర్పాట్లు చే శామన్నారు. 27న అభిషేకాలు, కుంకుమార్చన లు, ధూపసేవ అనంతరం గాంధీబొమ్మ సెంట ర్ నుంచి స్వామివారి, అమ్మవారి రథోత్సవం ప్రారంభమవుతుందన్నారు. 28న ఉదయం స్వామికి త్రిశూల స్నానం, తీర్థపుసేవ నిర్వహిస్తారన్నారు. ఏప్రిల్ 1న రాత్రి 7.40 నిమిషాలకు స్వామి,అమ్మవార్లకు ప్రీపుష్పయాగోత్సం నిర్వహిస్తారన్నారు. భక్తులకు అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఉత్సవా లను భక్తులు విజయవంతం చేయాలని కోరారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.

పిల్లల భవితకు విద్యే ఆధారం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పిల్లల భవితకు విద్యే ఆధారమని కాకినాడ సీపోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (కేఎస్‌పీఎల్) సీవోవో మెర్ల మురళీధర్ అన్నారు. కాకినాడ జగన్నాధపురం ఆదిత్య పాఠశాల 35వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మురళీధర్, గౌరవ అతిథిగా గైనకాలజిస్ట్ డాక్టర్ అలేఖ్య, ఆదిత్య ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ సుగుణా రెడ్డి పాల్గొన్నారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. ప్రధానోపాధ్యాయిని సప్రజారాణి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి

జైలు, జరిమానా

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 25 మందికి కాకినాడ మూడవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి జైలు, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ సీఐలు, ఎన్ రమేష్ డి.రామారావు తమ బృందాలతో ఆదివారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించగా 25 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా 9మందికి ఒక్కొక్కరికి 3 రోజుల చొప్పున జైలు శిక్ష, మరో నలుగురికి 5 రోజుల జైలు శిక్ష, 12 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.

టేబుల్ టెన్నిస్‌లో కాంస్య పతకం



కెప్టెన్ మోహన్‌బాబు

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వెటరన్ టేబుల్ టెన్నిస్‌లో రాష్ట్ర జట్టు ప్రతిభ చాటింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈనెల 17 నుంచి 23 వరకు జరిగిన 31వ జాతీయస్థాయి వెటరన్ టేబుల్ టెన్నిస్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తృతీయస్థానం సాధించి తొలిసారి కాంస్య పతకం సాధించింది. రాష్ట్ర జట్టుకు విశ్రాంత ఆయుష్ వైద్యాధికారి కోటగిరి మోహన్‌బాబు కెప్టెన్‌గా వ్యవహరించారు. 1975 నుంచి టీటీ ఆడు తున్న మోహన్‌బాబు 1978లో కాలికట్ నేషనల్స్, 1982, 84లో ఆలిండియాఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం కాకినాడ డీఎస్ఏ ఆడిటోరియంలో టీటీ శిక్షకుడిగా వ్యవరిస్తున్నారు. పోటీల్లో రాష్ట్ర జట్టుకు పతకం సాధించిన మోహన్‌బాబును డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, టీటీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చిన్నారావు అధ్యక్షుడు విజయప్రకాష్ తదితరులు అభినందించారు.

ఆరు నెలల శిశువు జననం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి మండలానికి చెందిన గర్భిణికి 6వ నెలలోనే నొప్పులు రావడంతో సోమవారం ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా తప్పనిసరి పరిస్థితుల్లో వైద్యులు ఆమెకు నార్మల్ డెలివరీ చేశారు. పుట్టిన వెంటనే శిశువు ఏడవకపోవడం, గుండె కొట్టుకోకపోవడం గుర్తించిన వైద్యులు శిశువుకు సీపీఆర్ చేసి గుండె కొట్టుకునేలా ప్రాణం పోశారు. మూత్రపిండాలు, ఇతర అవయవాలు పూర్తిస్థాయిలో ఎదకపోవడం వంటి సమస్యల నుంచి శిశువును కాపాడేందుకు వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్ ఎమర్జెన్సీ విభాగానికి తరలించారు.

పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలి

కూటమి నాయకుల ప్రచారం



సామర్లకోట మండలం గొంచాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, కుడా ఛైర్మన్

సామర్లకోట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు), బీజేపీ ఇంచార్జి వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం సామర్లకోట మండలం గొంచాలలో గ్రాడ్యుయేట్ల ఓటర్లకు కరపత్రాలు అందించి ఓట్లు అభ్యర్థించారు. వాసిరెడ్డి ఏసుదాసు, ముమ్మిడి సూరిబాబు, శ్రీనివాస సత్యనారాయణ పాల్గొన్నారు. రాత్రి సామర్లకోట పట్టణ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి టీడీపీ నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన వ్యూహాలపై టీడీపీ పరిశీలకులు బోళ్ళ వెంకటరమణ సమీక్షించి సూచనలు చేశారు.

కాకినాడ సిటీ: నారా లోకేష్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద మార్కెట్ ఏరియా తదితర ప్రాంతాల్లో ర్యాలీగా ఇంటింటికి వెళ్లి రాజశేఖర్‌కు ఓటు వేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఫౌండే షన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరామ్‌వర్మ, అనపర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు పొన్నాడ సాయి హరీష్, రూరల్ అధ్యక్షుడు మండపాక నాగబాబు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రచారంలో సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుత్తుల రమణ, జిల్లా టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎంఏ తాజుద్దీన్ ఆధ్వర్యంలో కాకినాడ కోర్టుల ఆవరణలో ఎమ్మెల్సీ ప్రచారం నిర్వహించారు. రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని న్యాయవాదులకు బ్యాలెట్ పేపర్ నమూనా పత్రాలు పంచుతూ కోరారు. స్థానిక 36వ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 36వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఎన్నికల బూత్ ఇన్‌చార్జి కొప్పాడ రాజు, బూత్ కన్వీనర్లు నల్లూరి తులసి, ఆకెళ్ల ప్రసాద్, ఉప్పులూరి వీరభద్రరావు, సత్యంశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

కరప: పేరాబత్తులకు మద్దతుగా కొరుపల్లి, జడ్.బావారం, గొడ్డటిపాలెం గ్రామాల్లో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, టీడీపీ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పేరాబత్తులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అరట్లకట్టలో కాకినాడరూరల్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కుడుపూడి సత్తిబాబు, టీడీపీ కాకినాడ రూరల్ కో కో-ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ గ్రాడ్యుయేట్‌లు, ఉపాధ్యాయులకు కరపత్రాలను అందజేశారు. కూటమి నాయకులు మట్టా ప్రకాష్‌గౌడ్, దేవు వెంకన్న, కోటగిరి మహేంద్రబాబు, పుల్లయ్యప్రసాద్, బెంజిమెన్ రాజు, గోన అంజి, వెలుగుబంట్ల శ్రీనివాస్, గుబ్బల భాస్కరరావు, వీరంరెడ్డి ముత్యాలరావు, ముమ్మిడి పుష్పలత, తోట కృష్ణ పాల్గొన్నారు.

కొత్తపల్లి: పేరాబత్తులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్‌వర్మ, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ ఆధ్వర్యంలో నాగులాపల్లిలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాధ్యత లేని మున్సిపల్ అధికారులు

సామర్లకోట కౌన్సిల్‌లో పలువురి ధ్వజం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

సామర్లకోట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపాల్టీలో మున్సిపల్ అధికారులకు గౌరవసభ్యుల పట్ల ఎంతమాత్రం గౌరవం లేదు. బాధ్యత లేదు. ఇది మాకు తీరని అవమానం అంటూ కౌన్సిలర్ జట్ల మోహన్, సభ్యులు ధ్వజమెత్తారు. సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఛైర్‌పర్సన్ జీ.అరుణ అధ్యక్షతన నిర్వహించారు. తన వార్డులో వీధిలైట్లు సక్రమంగా పనిచేయడం లేదని గత 5 నెలలుగా సమావేశాల్లో ఫిర్యాదులు చేస్తున్నా పరిష్కారం చూడడంలేదని కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ ఆరోపించారు. మున్సిపల్ సహాయ ఇంజనీరు ఇచ్చిన వివరణపై సత్యనారాయణ మాట్లాడుతూ మీ వల్ల కాకుంటే పక్కకు తప్పుకోండి నేను 2 రోజుల్లో చేసి చూపిస్తానంటూ సవాల్ విసిరారు. సమావేశంలో అధికారుల తీరు పట్ల అధ్యక్షస్థానంలో ఉన్న ఛైర్‌పర్సన్ సైతం జోక్యం చేసుకోవాలని కోరారు. పట్టణం లో దివ్యాంగుల పింఛన్లు రద్దు చేసేందుకు సర్వే చేపడుతున్నారని, కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా ప్రజల ముందు తమను చులకన చేస్తున్నారని కౌన్సిలర్ నేతల హరిబాబు ఆరోపించారు. ప్రభుత్వ పాలసీ మేరకు సదరం ధ్రువపత్రాలు తిరిగి పరిశీలన చేస్తున్నారని సభ్యులకు ప్రత్యేకించి సమాచారం చెప్పక్కర లేదని కమిషనర్ శ్రీవిద్య తెలిపారు. అజెండాలోని కేవలం 2 అంశాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. సమావేశంలో డీఈ శశిధర్, శ్రీనివాసు, టీపీవో మంజుల, ఆర్ఐ శ్యామల తదితర కౌన్సిలర్లు, అధికారులున్నారు.

'విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకోవాలి'

సామర్లకోట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు లక్ష్యాలను ఏర్పరచుకుని ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్లాలని కాకినాడ డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి నాయుడు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సామర్లకోట అయోధ్య రామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం డీవైఈవో వివిధ ప్యానెల్ సబ్జెక్ట్‌ల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను, ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను పరిశీలించి నివేదిక అందజేశారు. ప్రధానోపాధ్యాయులు తొటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆల్‌రౌండ్ ప్రతిభ, ఉపాధ్యాయుల బోధనా పటిమ పట్ల సమీక్షించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సామర్థ్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుల సమన్వయంతో పాఠశాల ప్రగతికి కృషిచేయడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో నూరుశాతం ఉత్తీర్ణతతో అత్యధిక మార్కుల సాధనకు కృషిచేయాలన్నారు. తనిఖీల్లో ప్యానెల్ సబ్జెక్ట్ నిపుణులు ఉదయ్‌భాస్కర్, మూర్తి, ప్రేమజ్యోతి, పి.కొండలరావు, బ్రహ్మానందం, గంగారామ్, జీవీవీ.సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం



కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ హాకీ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో భాగంగా వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలిగిచకుండా పారిశుధ్య కార్మికులు నిత్యం చేస్తున్న సేవలను గుర్తించి సోమవారం రాత్రి వారిని ఘనంగా సత్కరించారు. పారిశుధ్య కార్మికులు వారు విధుల్లో భాగంగా క్రీడా మైదానం లోపల, బయట భోజన కార్యక్రమాల వద్ద ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహిస్తూ ఉండడంతో టోర్నమెంట్ నిర్వాహకులు వారి కష్టాన్ని గుర్తించి కార్మికులందరికీ జిల్లా క్రీడా అధికారి శ్రీనివాస్‌కుమార్, టోర్నమెంట్ కోఆర్డినేటర్ రవిరాజు ఆధ్వర్యంలో దుశ్శాలువాతో సత్కరించి మెమోంటో అందించారు. శ్రమను గుర్తించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గవర్నర్ ప్రసంగంపై ఎమ్మెల్యే నానాజీ హర్షం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరంలో విద్యుత్తు చార్జీలు పెంచబోమని రాష్ట్ర శాసనసభలో ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ తన ప్రసంగంలో తెలియచేయడం పట్ల కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో అనేక పర్యాయాలు ఇబ్బడిముబ్బిడిగా విద్యుత్తు చార్జీలు పెంచిన జగన్ నిరుపేదలు, మధ్య తరగతి ప్రజల నడ్డివిరిచారన్నారు. విద్యుత్తు చార్జీలు పెరగకుండా చర్యలు తీసుకుంటామని గవర్నర్ చెప్పడంపై గవర్నర్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

మురుగు నీరు పారక నానా అవస్థలు!

పెద్దాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరు గ్రామంలో బీసీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీలో మురుగు నీరు పారక నానా అవస్థలు పడుతున్నట్లు కాలనీ వాసులు వాపోతున్నారు. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరు పారేందుకు అడ్డంకి మారింది. ఈ విషయాన్ని పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీరు పారే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు



కట్టమూరు బీసీ కాలనీలో కాలువలో పేరుకుపోయిన మురుగు

'తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించాలి'

కోటనందూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వేసవికాలం ఆరంభం కావస్తున్నందున అధికారులు తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించాలని ఎంపీపీ లగుడు శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం జరిగింది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ఠ భద్రత





కూనవరం: వల్లీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన ఏఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా

వై.రామవరం: గురమండ శివరాత్రి ఏర్పాట్లపై మాట్లాడుతున్న సీఐ నరసింహమూర్తి

కూనవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిగూడెం పంచాయతీ కొమరస్వామి గుట్ట శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని ఏఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా సోమవారం సందర్శించారు. మహాశివరాత్రికి పటిష్ఠ భద్రతా ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎటపాక సీఐ కన్నపరాజు, కూనవరం ఎస్ఐ లతశ్రీ, వీఆర్ పురం ఎస్ఐ సంతోష్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

వై.రామవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురమండకాశీవిశ్వనాథ స్వామి, పూతిగుంట గుబ్బలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద మహా శివరాత్రి ఏర్పాట్లను అడ్డతీగల సీఐ నరసింహమూర్తి సోమవారం పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక సూచనలిచ్చారు. భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆలయాల కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సీఐ వెంట నిర్వాహకుడు పల్లాల వెంకటరమణారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ వున్నారు.

కుట్టుమిషన్లు పంపిణీ

మోతుగూడెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలోని ఫోర్‌బై, ఇంతులూరు వాగు, రాజు క్యాంపు, మోతుగూడెం గ్రామాలకు చెందిన 11మంది నిరుపేద మహిళలకు సీఆర్పీఎఫ్-42 బెటాలియన్ ఆధ్వర్యంలో అరుణతో నెల రోజులు టైలరింగ్ శిక్షణ ఇప్పించారు. సోమవారం వారికి కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లను సీఆర్పీఎఫ్ క్యాంపు ఆఫీసులో కమాండెంట్ దారం ప్రకాష్ అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎంఎల్ షైనీ, ఎస్ఐ శివనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

తేనెటీగల పెంపకంపై శిక్షణ

మోతుగూడెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన యువకులకు వారం పాటు తేనె టీగల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. సోమవారం వారికి వై.రామవరం మండలం డొంకరాయి పోలీస్‌స్టేషన్లో సీఆర్పీఎఫ్ కమాండెంట్ దారం ప్రకాష్ తేనెటీగలు సేకరించే పెట్టెలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కరకా వెంకటరమణ, ఎస్ఐ శివనారాయణ, సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పేరాబత్తుల రాజశేఖరం గెలుపుకోసం ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

దేవీపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా సోమవారం ఇందుకూరు-1, మంటూరు, ఆర్అండ్ఆర్ కాలనీ, ఏనుగులగూడెం, అగ్రహారంల్లో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, క్లస్టర్ ఇన్‌చార్జి మాగాపు బాబూరావు, కారం పోశమ్మ, కుంజం శివదొర, సీనియర్ నాయకులు చారపు రాంబాబు, బోరగా నాగరాజు, పల్లపాటి నాగేశ్వరరావు, పుట్టపల్లి మల్లేష్, జనసేన కార్యదర్శి కొమరం దొర బాబు, కారం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మన్యంకొండ జాతర ఏర్పాట్లపై సమీక్ష

మోతుగూడెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఆదేశాలతో చింతూరు ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వ ర్యంలో మన్యంకొండ జాతరపై సోమవారం సమీక్షించారు. ఒడిశా నుంచి మన్యంకొండ జాతరకు వచ్చే భక్తులు ఘాట్ ఎక్కే ప్రదేశాలను ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ కిషోర్‌కుమార్, లోయర్ సీలేరు ఏపీ జెన్కో ప్లాంట్ మేనేజరు భీమవరపు బాలకృష్ణ, మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి జి.మోహన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పరిశీలించారు.



సీలేరు నది ఒడ్డు నుంచి ఘాట్ ప్రదేశాలు పరిశీలిస్తున్న అధికారులు

ఫేర్‌వెల్ డేలో సందడి చేసిన విద్యార్థులు



డ్యాన్స్‌లతో అలరిస్తున్న కళాశాల విద్యార్థులు

వై.రామవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.యర్రగొండ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఫేర్‌వెల్ డే జరుపుకున్నారు. సహచరులు, అధ్యాపకులతో గడిపిన మధుర సంఘటనలను గుర్తుచేసుకుంటూ పాటలు, డ్యాన్సులతో అలరించారు. కార్యక్రమంలో అధ్యాపకులతో పాటు ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్చి 12 నుంచి అష్టలక్ష్మి యాగం

ఎటపాక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అష్టలక్ష్మి పీఠం వ్యవస్థాపకుడు పీతాంబరం రఘునాథాచార్యులు స్వామీజీ ఆధ్వర్యంలో వచ్చే నెల 12 నుంచి 23వ తేదీ వరకు అష్టలక్ష్మి యాగం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. దీనికి సంబంధించి మండలంలోని ఉప్పగుండాల సమీపంలో స్థలాన్ని స్వామీజీతో పాటు నక్కా భాస్కరరావు సోమవారం పరిశీలించారు.



అష్టలక్ష్మి యాగం కోసం ఏర్పాట్లు పరిశీలిస్తున్న నిర్వాహకులు

ఏటీఏ మహిళా కమిటీకి రూ.20వేలు విరాళం

ఎటపాక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ మహిళా కమిటీకి ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు, జేకే ట్రస్టు చైర్మన్ జమాల్‌ఖాన్ సోమవారం రూ.20వేలు అందజేశారు. కార్యక్రమంలో ఏటీఏ సంఘ సభ్యులు రజని, శారద, దేవి, విజయ, శ్రీను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ఏటీఏ మహిళా కమిటీకి రూ.20వేలు విరాళం ఇచ్చిన జమాల్‌ఖాన్

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కూటమి అభ్యర్థి పేరాబత్తులను గెలిపించండి

కూటమి నాయకుల ప్రచారం



ఏలేశ్వరం: ప్రచారం చేస్తున్న ఎంపీపీ బుజ్జి



కిర్లంపూడి: కరపత్రాలు అందజేస్తున్న తుమ్మలపల్లి

ఏలేశ్వరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సోమవారం ప్రచారం చేశారు. మండలంలోని పేరవరం, భద్రవరం, సిరిపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. రాజశేఖర్‌ను ఓటు వేసి గెలిపించాలని కరపత్రాలు పంచారు.

కోటనందూరు: ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన రాజశేఖరం విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజబాబు, మాజీ ఎంపీపీ డి.చిరంజీవిరాజు అన్నారు. కేపీ మల్లవరం, కోటనందూరు, కేవో అగ్రహారం, జగన్నాథపురం, భీమవరపుకోట, పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. అంకంరెడ్డి రమేష్, పెంటకోట భాస్కర సత్యనారాయణ, షేక్‌నవాబ్‌జానీ, వెలగా వెంకట కృష్ణారావు, యర్ర చినసత్యనారాయణ, చింతకాయల రవికుమార్, కొరుప్రోలు రఘు, లగుడు సత్యనారాయణమూర్తి ఉన్నారు.

కిర్లంపూడి: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నుంచి పోటీచేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ కిర్లంపూడిలో జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ప్రచారం నిర్వహించారు. జనసేన నాయకులు డేగల విజయ్‌కుమార్, గంధం ప్రభాకర్, పాతిరెడ్డి శేఖర్, పాటంశెట్టి రమేష్, బొండా నందిబాబు, నాగబోయిన శివ, చిక్కాల భగవాన్, పుర్రె శ్రీనివాస్, నాసిన రాజకుమార్, రేవూరి శ్రీను, నల్లబాబు పాల్గొన్నారు.

శంఖవరం: కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టం కట్టాలని టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ అన్నారు. శంఖవరంలో ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తులకు మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని అభ్యర్థించారు. జనసేన నేత మేకల కృష్ణ, బొర్రా వాసు, జట్ల శ్రీను, దాసరి రాకేష్, పిల్లా గంగాధర్, మలికి వెంకన్న, బి.పాపారావు ఉన్నారు.



శంఖవరంలో ఓట్లు అభ్యర్థిస్తున్న టీడీపీ నేత సురేష్

ప్రత్తిపాడు: కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ప్రత్తిపాడు ఎస్‌బీఐ బ్యాంక్ పరిసరాల్లో నియోజకవర్గ పరిశీలకుడు మెట్ల రమణబాబు, టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, మరో పరిశీలకుడు గంటా సూకరాజు, యర్రాబత్తుల గోవిందనాయుడు, మదినే దొరబాబు ప్రచారం చేశారు. ధర్మవరంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఊటా వీరబాబు, ఏలూరు సర్పంచ్ రొంగల సత్యనారాయణ, ప్రత్తిపాడులో బీజేపీ నేత సింగిలిదేవ్ సత్తిరాజు ప్రచారం నిర్వహించారు.

తునిరూరల్: కూటమి ప్రభుత్వంతోనే ఉద్యోగులకు మేలు జరుగుతుందని తుని నియోజకవర్గ పరిశీలకులు, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా కార్యకర్తలతో కలిసి ఆమె తుని రూరల్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సుర్ల లోవరాజు, డాక్టర్ గంటల చిన్నారావు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్తిపాడు, తుని ఎమ్మెల్యేలు



అసెంబ్లీ ప్రత్తిపాడు, తుని ఎమ్మెల్యేలు సత్యప్రభ, యనమల దివ్య

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని సోమవారం నుంచి ప్రారంభమైన రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్తిపాడు, తుని ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ రాజా, యనమల దివ్య పాల్గొన్నారు. సమావేశంలో ఇతర జిల్లాల మహిళా ఎమ్మెల్యేలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనడం ఎంతో ఆసక్తికరంగా సంతోషంగా ఉందని తెలిపారు.

'28న రైతు కూలీ సంఘం రాష్ట్ర సదస్సు'



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

జగ్గంపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో భూమి సమస్యలపై జరుగుతున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆ కమిటీ రాష్ట్ర సభ్యులు చిట్టిబాబు కోరారు. అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షురాలు కామ్రేడ్ టాన్యా, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు టి.ప్రకాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.గిన్నిరాజు, ఏపీ రైతు కూలీ సంఘం కన్వీనర్ వడ్డే నాగేశ్వరరావు, తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి బి.భాస్కర్ హాజరవుతారన్నారు. జగ్గంపేట స్టాలిన్ భవన్‌వద్ద సోమవారం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కె.లక్ష్మీ, ఎస్.వరదరాజు, ఎస్.రామిశెట్టి, పెద్దాపురం డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కారుకొండ శ్రీను పాల్గొన్నారు.

'అక్రమ మైనింగ్ రద్దు చేయాలి'

రౌతులపూడి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు అన్నారు. రౌతులపూడిలోని పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు సామిరెడ్డి నారాయణమూర్తి అధ్యక్షతన సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బంగార్రావు మాట్లాడుతూ మండలంలో అక్రమ మైనింగ్‌ను రద్దు చేయాలన్నారు. పారుపాకలో కొండ పోరంబోకు భూమికి పట్టాలివ్వాలన్నారు. ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మానుకొండ లచ్చబాబు, బొడ్డియ్య, అప్పలరాజు, సత్యవతి పాల్గొన్నారు.

కిర్లంపూడిలో ఘనంగా శాంతిహోమం

కిర్లంపూడి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక రమణయ్యపేట రామాలయం వద్ద సోమవారం ఘనంగా శాంతిహోమం నిర్వహించారు. లోక కల్యాణార్థం రమణయ్యపేటవాసులు తలపెట్టిన ఈ హోమం తాటిపర్తి గ్రామానికి చెందిన అపర్ణాదేవి ఆలయ వ్యవస్థాపకులు, ప్రముఖ వేద పండితులు డాక్టర్ ఆకొండి వెంకటేశ్వరశర్మ సారథ్యంలో పలువురు వేదపండితులు నిర్వహించారు.

'హెల్త్ సూపర్‌వైజర్‌ను తక్షణం సస్పెండ్ చేయాలి'

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రావులపల్లిలో ఉన్న పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ కనకరాజును తక్షణమే సస్పెండ్ చేయాలని జిల్లా ఆశావర్కర్స్ డిమాండ్ చేశారు. జగ్గంపేటలో ఆశావర్కర్లతో ఆశా వర్కర్స్ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.బేబిరాణి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాట్రావులపల్లి పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న సీనియర్ ఆశవర్కర్లను కనీస గౌరవం లేకుండా అసభ్యకర పదజాలంతో అవమానిస్తున్న కనకరాజును తక్షణమే సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇటీవల అతడిపై విచారణ జరిగినా అతడి ప్రవర్తనలో మార్పు లేదన్నారు. ఈ సమస్యలపై కాట్రావులపల్లి పీహెచ్‌సీ వద్ద మార్చి 3న ధర్నా నిర్వహిస్తామన్నారు. ఆశావర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమల్ల పద్మ, మండల ఆశావర్కర్లు నాయకురాలు చిత్రడ మంగ, ఏపూరి చిలకమ్మ, వై.మౌనిక, బత్తిన సుశీలరాణి, కమల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బేబిరాణి

సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గృహనిర్మాణ పనుల వివరాలు ప్రజాప్రతినిధులకు తెలియడం లేదంటూ మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వెలిబుచ్చారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో అవకతవకలకు పాల్పడిన క్షేత్రస్థాయి సిబ్బందిపై తీసుకున్న చర్యలు ఏంటనే దానిపై ప్రజాప్రతినిధులు సమావేశంలో నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీడీవో కుమార్‌బాబు, అధికారులు పాల్గొన్నారు. ప్రత్తిపాడు, చినశంకర్లపూడి, ఉత్తరకంచి, ఏలూరు ఎంపీటీసీలు గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ఇళ్ల నిర్మాణ పనులు తెలియడం లేదని, శరభవరం సర్పంచ్ అమరాది వెంకట్రావు ఉపాధి హామీ పథకంలో అవకతవకలపై పాల్పడిన చర్యలు ఏంటని నిలదీశారు. ఎంపీడీవో ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లపై తీసుకున్న చర్యలు ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. గృహనిర్మాణ పథకాలు ప్రజాప్రతినిధులకు తెలియజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న 72 పశువులు పట్టివేత

కిర్లంపూడి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా నుంచి కేరళ రాష్ట్రం వైపు అక్రమంగా కంటెయినర్‌లో తరలిస్తున్న 72 పశువులను సోమవారం కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్‌గేట్ వద్ద పట్టుకున్నట్టు కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్ తెలిపారు. కంటెయినర్ లారీని కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌కి తరలించి అక్కడి నుంచి గోవుల సంరక్షణార్థం గోకవరం మండలం కృష్ణపాలెం గోశాలకు తరలించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీష్ వివరించారు.




కంటెయినర్‌లో పశువులు

తామరాడ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

కిర్లంపూడి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ దంటు కళాక్షేత్రంలో జరిగిన రాష్ట్రస్థాయి నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనల పోటీల్లో జడ్పీ ఉన్నత పాఠశాల తామరాడ విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. లఘు నాటికల విభాగంలో జూనియర్ విభాగం నుంచి ప్రదర్శించిన అయ్యా నే బడికి పోతా అనే నాటికకు రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. మెమెంటో, నాటికలో నటించిన విద్యార్థులకు ప్రతిఒక్కరికీ మెడల్, సర్టిఫికెట్ బహూకరించారు. పి.జీవన్‌కుమార్, సీహెచ్ పవన్‌కుమార్, ఎల్.వినయ్‌కుమార్, జి.అజయ్‌శ్రీరామ్, ఎ.శివశంకర్ దుర్గావరప్రసాద్ నటించారు. సీనియర్స్ విభాగంలో మాతృదేవోభవ నాటికకు తృతీయ బహుమతి లభించింది. బి.చంద్రలేఖ, ఎ.కృష్ణవాణి, ఎస్.వాస్తవిదుర్గ, ఇ.వీరచక్ర, ఇ.వరలక్ష్మి తదితర విద్యార్థినులు నటించగా మెడల్, ప్రశంసాపత్రాలు అందించారు. నాటికలను రచించి, దర్శకత్వం వహించి, తర్ఫీదునిచ్చిన పీజీటీ సివిక్స్ అధ్యాపకులు బావిశెట్టి లక్ష్మీనారాయణను పాఠశాల హెచ్ఎం ఎల్.కృష్ణ, స్టాఫ్ సెక్రటరీ నూకరాజు అభినందించారు.

సందడిగా ఫేర్‌వెల్ డే

శంఖవరం, ఫిబ్రవరి 24(ఆంధ్ర జ్యోతి): కత్తిపూడి సీతారామ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలు సందడిగా జరిగాయి. 2023-24 విద్యాసంవత్సరం విద్యార్థుల వీడ్కోలు దినోత్సవాన్ని కళాశాల ఆవరణలో నిర్వహించారు. విద్యార్థుల ఆటపాటలతో, సాంఘిక నృత్యాలతో రోజంతా ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీరబాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మొగలి అక్కారావు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ వీరబాబు

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

పిఠాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణంలో బోధన సాగించాలని పిఠాపురం ఎంఈవో జి.శ్యాంబాబు సూచించారు. 120రోజుల జీవనజ్యోతి అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ ఐదోవ రోజు సోమవారం ఈసీ సీఈ డే, గ్రాడ్యుయేషన్ డే, టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఉన్న పరికరాలను వినియోగించి విద్యాబోధన ఎలా చేయాలనే అంశంపై శిక్షణ ఇచ్చారు

'ఆదిత్య'లో అతిథి ఉపన్యాసం

గండేపల్లి,ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో డే వోప్స్ భవిష్యత్ ధోరణులు, సవాళ్లు, కెరీర్ రోడ్‌మాప్ అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్‌గా వై.గీతిక, సీనియర్ క్లౌడ్, డేవోప్స్ ఇంజనీర్, డెలాయిట్ సంస్థ నుంచి విచ్చేశారు. ఆమె డే వోప్స్ సంబంధిత కొత్త ధోరణులు, అప్‌డేట్లు, రంగంలో ఎదురయ్యే సవాళ్లను వివరించారు. విద్యార్థులు తమ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన నైపుణ్యాలపై అవగాహన పొందారు.

ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రిలో ఆరు నెలల శిశువు జననం

కాకినాడ జీజీహెచ్‌కు తరలింపు



పుట్టిన శిశువు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నెలలు నిండకుండానే ఆరునెలల శిశువుకు ప్రత్తిపాడు ఆస్పత్రిలో ఓ తల్లి జన్మనిచ్చింది. దీంతో గుండె, మూత్రపిండాలు పనిచేయకపోవడంతో వైద్యులు సీపీఆర్ చేసి ప్రాణాలు పోశారు. మూత్రపిండాలు ఇతర సమస్యలు ఉండడంతో ఆరునెలల పసికందును మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రి ఎమర్జెన్సీ విభాగానికి తరలించారు. కిర్లంపూడి మండలానికి చెందిన గర్భిణికి 6వ నెలలోనే నొప్పులు రావడంతో సోమవారం ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా తప్పనిసరి పరిస్థితుల్లో వైద్యులు ఆమెకు నార్మల్ డెలివరీ చేశారు. పుట్టిన వెంటనే శిశువు ఏడవకపోవడం, గుండె కొట్టుకోకపోవడం గుర్తించిన వైద్యులు శిశువుకు సీపీఆర్ చేసి గుండె కొట్టుకునేలా ప్రాణం పోశారు. మూత్రపిండాలు, ఇతర అవయవాలు పూర్తిస్థాయిలో ఎదకపోవడం వంటి సమస్యల నుంచి శిశువును కాపాడేందుకు మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్ ఎమర్జెన్సీ విభాగానికి తరలించారు.

ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు సిద్ధం: రాజా

జగ్గంపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై గొంతు ఎత్తి మాట్లాడేందుకు తమ నాయకుడు సిద్ధంగా ఉన్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. జగ్గంపేటలోని పార్టీ కార్యాలయానికి సోమవారం విచ్చేసిన ఆయనకి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ తోట నరసింహం, యువ నాయకుడు తోట రాంజీ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో రాజా మాట్లాడారు. పదవి వచ్చిన తర్వాత తొలిసారి తోట నరసింహం ఆశీస్సులు తీసుకునేందుకు ఇక్కడకు వచ్చానన్నారు. తోట నరసింహం మాట్లాడుతూ ఇటీవల తునిలో రాజాపై జరిగిన దాడులు చాలా దారుణమన్నారు. సమావేశంలో జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు ఒమ్మి రఘురాం, జగ్గంపేట మండల వైసీపీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా పాల్గొన్నారు.

'ఆదిత్య'లో వర్క్‌షాప్

గండేపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ రెండో ఏడాది ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎంబెడెడ్ సిస్టమ్‌పై 5రోజుల వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. మొదటిరోజు ఏపీ రాష్ట్ర శిక్షణా అభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించామన్నారు. దీనికి రిసోర్స్‌పర్సన్‌గా ట్రైనర్ సీహెచ్ సంతోష్ పాల్గొన్నారు. స్మార్ట్ ఫోన్లు, ఏటీఎం, జీపీఎస్, టీవీ, విద్య పరికరాలు, కెమెరాలు తదితర అన్నీ ఎంబెడెడ్ సిస్టమ్స్ ద్వారానే నడుస్తున్నాయని తెలిపారు.

అన్నవరం ఈవో పూజలు




స్వామివారిని దర్శించుకుంటున్న ఈవో

శంఖవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుని దేవస్థానానికి దత్తత దేవాలయమైన శంఖవరంలో శ్రీపార్వతి మల్లేశ్వరస్వామివారిని అన్నవరం ఈవో వీర్ల సుబ్బారావు సిబ్బందితో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఏఈవో ఎస్.శ్రీనివాస్, సూపరింటెండెంట్ కంచి మూర్తి, సీనియర్ అసిస్టెంట్ వెలగా రమేష్ ఉన్నారు.

భారీ అన్నసమారాధన

తొండంగి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బెండపూడి షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పెద్దఎత్తున వచ్చిన భక్తులు అన్న ప్రసాదాన్ని అందించారు.



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

'ఆక్రమణలు తొలగించాలి'

జగ్గంపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సచివాలయం-2 సమీపంలోని తిరుమలేశా లేఅవుట్ శ్రీరామ్‌నగర్-గోకవరం రోడ్డును ఆక్రమించుకుని నిర్మించిన భవనాలను తక్షణం తొలగించాలని బీఎస్పీ జగ్గంపేట ఇన్‌చార్జ్ జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. తక్షణమే అక్కడ అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు.



తహశీల్దార్‌కు వినతి అందజేస్తున్న దృశ్యం